నవతెలంగాణ

నమ్మదగ్గ తెలుగు దినపత్రిక

1

మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

బుధవారం | 03 జనవరి 2024 | www.navatelangana.com

పెట్రోల్, డీజిల్ కోసం బారులు..



నవతెలంగాణ-జహీరాబాద్

కేంద్ర ప్రభుత్వం తీసుకున్న మోటార్ వాహన చట్టం నిర్ణయానికి వ్యతిరేకంగా ఉత్తరాది రాష్ట్రాల్లో లారీ యజమానులు సమ్మె నిర్వహించడంతో.. బంకుల్లో పెట్రోల్, డీజిల్ లేక నో స్టాక్ బోర్డులు వెలిశాయి. ఈ క్రమంలో పెట్రోల్ పోసుకోవడానికి వచ్చిన వాహనాలు బంకుల్లో బారులు తీరాయి. దాంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. చివరికి పెట్రోల్ బంకుల యజమానులు లైట్లు బంద్ చేసి అక్కడి నుండి వెళ్లిపోయే పరిస్థితి ఏర్పడింది. వాహనదారులు పెద్ద ఎత్తున అక్కడే ఉండడంతో.. పోలీసులు జోక్యం చేసుకొని ట్రాఫిక్‌ను మళ్ళించేందుకు ప్రయత్నం చేశారు.

మంత్రి, ఎస్పీని కలిసిన టీఎన్జీవోస్ నాయకులు



నవతెలంగాణ-సంగారెడ్డి

మంత్రి దామోదర్ రాజనర్సింహను, జిల్లా ఎస్పీ రూపేష్, అడిషనల్ ఎస్పీ అశోక్‌ను టీఎన్జీవోస్ నాయకులు జిల్లా అధ్యక్షులు యం.డి.జావీద్ ఆలీ ఆధ్వర్యంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఎన్జీవోస్ నాయకులు వి.రవి, కసిని శ్రీకాంత్, పి.వెంకటరెడ్డి, జి. శ్రీనివాస్, యం.నర్సింలు, నిర్మల రాజకుమారి, కసిని మమత, సుధామని, ఎండి. కాజా గౌస్, శ్రీనివాస్, భాస్కర్, శ్రీనివాస్, విజయకుమార్, షకీల్, శ్రీకాంత్ గౌడ్, మహేష్, కంది కృష్ణ, శివరాజ్, రవికృష్ణ, యాదవ రెడ్డి,ఆనంద్, దుర్గేష్, గోపాల్, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జిని కలిసిన మంత్రి

నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్

కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇన్చార్జి దీపా దాస్ మున్షీని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి ప్రభాకర్ గౌడ్ మంగళవారం మర్యాదపూర్వం కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.



ఏసీపీకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన నర్సింహులు

నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ ఏసీపీ రమేష్‌ని ఆయన కార్యాలయంలో జాతీయ యువజన అవార్డు గ్రహీత, జిల్లా బాలల సంక్షేమ సమితి సభ్యులు దేశబోయిని నర్సింహులు, బాలకిషన్‌తో కలిసి మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఏసీపీని శాలువాతో సన్మానించి పూల మొక్కను అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలకు ఏసీపీ ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ మంచి గుర్తింపు తెచ్చుకున్నాడని కొనియాడారు. ఆయన భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాక్షించారు.



అర్హులందరూ ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-తొగుట

ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ బొడ్డు నర్సింలు, అప్పనపల్లి శ్యామల ఆంజనేయులు అన్నారు. మండలంలోని చందాపూర్, రాంపూర్ వడ్డెర కాలనీ గ్రామాల్లో మంగళవారం ప్రజా పాలన దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరిస్తున్నదన్నారు. గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరు దరఖాస్తు చేసుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి వినయ్ కుమార్,ఎంపీడీవో శ్రీధర్, ఎంపీఓ చందన, ఏపీఎం మగ్దుం అలీ, విద్యుత్ ఏఈ శ్రీనివాస్, ఏఎస్ఐ రాంరెడ్డి, ఏపీఓ కిషన్, పంచాయతీ కార్య దర్శులు మహేశ్వరి, దివ్య ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, ఆయా గ్రామాల ప్రజలు తదితరులున్నారు.



ప్రజా పాలనను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-జోగిపేట

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రజల కోసం చేపట్టిన ప్రజా పరిపాలన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జోగిపేట మున్సిపల్ 10వ వార్డు కౌన్సిలర్ పట్లోళ్ల రేఖా ప్రవీణ్ అన్నారు. వార్డు పరిధిలో ప్రజా పరిపాలన కార్యక్రమాన్ని మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలు అరుహ్లైన ప్రతి ఒక్కరికి అందేలా చూస్తానన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజ నర్సింహ నేతృత్వంలో జోగిపేట మున్సిపల్ అభివృద్ధికి అనేక నిధులు రానున్నాయని ధీమా వ్యక్తం చేశారు. ప్రజల కష్టాల ను కాంగ్రెస్ ప్రభుత్వం తీర్చేందుకే ఈ కార్యక్రమం చేపట్టిం దన్నారు. జనవరి 6 వరకు ప్రతి ఒక్కరూ తమ దరఖాస్తులు అధికారులకు అందించాలని సూచించారు. వార్డులో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకు రావాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా అవార్డుల కౌన్సిలర్లు కోరబోయిన నాగరాజు, దుర్గేష్, చందర్, మున్సిపల్ ఏఈ వితోబా, కాలనీవాసులు చిట్యాల మధు, గుర్రం కృష్ణ, మోది ని రాజు, మల్లేశం, లక్ష్మణ్, నాగభూషణం, రమేష్, సుధాకర్, శివ తదితరులు పాల్గొన్నారు.



క్రీడల్లో గెలుపోటములు సహజం

నవతెలంగాణ-జహీరాబాద్

క్రీడల్లో గెలుపోటములు సహజం అని బీఆర్ఎస్ మండలాధ్యక్షులు తట్టు నారాయణ యాదవ్ అన్నారు. జహీ రాబాద్ మండలంలోని లచ్చనాయక్ తాండా గ్రామ పంచా యతీలో జై సేవలాల్ గ్రామస్థాయి టెన్నిస్ బాల్ టోర్న మెంట్ విజేతలకు మెమెంటోను మంగళవారం అందించా రు. ఫైనల్ పోటీల్లో పట్లూర్ తాండాసీసీ జట్టు మరియు లచ్చ నాయక్ తాండా సీసీ మధ్య తలపడగా.. పట్లూర్ తాండా సీసీ జట్టు విజేతగా అవతరించింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు ఆల్రౌండర్ మున్నకు లభించగా, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ స్టార్ ఆల్‌రౌండర్ విజయ్‌కు ఇచ్చారు. ఈ సంద ర్భంగా ముఖ్య అతిథి తట్టు నారాయణ మరియు విశ్వనాథ్ మాట్లాడుతూ.. క్రికెట్ స్ఫూర్తిదాయకమైన ఆట అని, ఇక్కడ అంకితబావం, క్రమశిక్షణతో ఆడినవారు విజయం సాధిసా ్తరన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని జహీరాబాద్ నియోజకవర్గంలోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. టోర్నీ విజేత పట్లూరు తాండా సీసీ జట్టుకు రూ.35 వేల నగదుతో పాటు ట్రోఫీని తట్టు విశ్వనాథ్ యాదవ్ ఇవ్వగా, రన్నర్ జట్టు లచ్చనాయక్ తాండా సీసీ జట్టుకు రూ.20 వేల నగదుతో పాటు ట్రోఫీని మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు తట్టు నారాయణ చేతుల మీదుగా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ధన్‌సింగ్, మాజీ సర్పంచ్ జగదీశ్వర్, ఉప సర్పంచ్ తారాసింగ్, మండల సోష‌ల్ మీడియా అధ్యక్షుడు విజయ్ రాథోడ్, బీఆర్ఎస్ గ్రామా ధ్యక్షుడు గొల్ల జగన్నాథం, గంట శ్రీనివాస్, తాలూకా గొల్ల కురుమ యాదవ యువజన సంఘం అధ్యక్షుడు రాజా రమేష్, తట్టు సాయి, నకుల్ చవాన్, రమేష్ ,బన్ను రిపోర్టర్ అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం

- ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

నవతెలంగాణ-జహీరాబాద్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యం అని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. జహీరాబాద్ నియోజకవర్గం న్యాల్కల్ మండలంలోని బసంత్‌పూర్ మంగళవారం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గతంలో కూడా తమ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను చేపట్టిందన్నారు. నిరుపేదలకు నిర్మించి ఇవ్వడంతోపాటు.. అర్హులకు భూములిచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానిదే అన్నారు. రాష్ట్ర సాధన కోసం ఆత్మహత్య చేసుకున్న వారికి ఇంటిని నిర్మించి ఇస్తామన్నారు. ఈ మండలానికి చెందిన ఇశాంత్ రెడ్డి ప్రాణ త్యాగం చేసిన విషయం తెలిసిందేనని.. వారి కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామన్నారు.కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని ప్రకటించారు. తమ ప్రభుత్వమిచ్చిన ఆరు గ్యారెంటీల్లో నాలుగు బాకీ ఉన్నాయని.. వాటిని కూడా త్వరలోనే అమలు పరుస్తామన్నారు. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధే లక్ష్యంగా తమ ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. జహీరాబాద్ నియోజకవర్గం తన నియోజకవర్గానికి ఆనుకొని ఉన్నందున.. ఇక్కడ అభివృద్ధికి తన శాయశక్తులా కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యే మాణిక్యరావు మాట్లాడుతూ.. మంత్రి తమ నియోజకవర్గంలో పర్యటనకు



రావడం ఆనందంగా ఉందన్నారు. కానీ అక్కడక్కడ చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్, వివిధ శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

చాల్కి గ్రామంలో మాజీ మంత్రి డాక్టర్ ఏ.చంద్రశేఖర్ మంత్రికి స్వాగతం పలికి పుష్పగుచ్చం ఇచ్చి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు సహనంతో వైద్య సేవలు అందించాలి..

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

వైద్యులు, వైద్య సిబ్బంది ఆస్పత్రికి వచ్చే రోగులకు సహనంతో వైద్య సేవలు అందించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. మంగళవారం నారాయణఖేడ్ లోని ఏరియా ఆసుపత్రిని మంత్రి సందర్శిం చారు. ఆస్పత్రిలోని అన్ని వార్డులను తిరిగి పరిశీలించారు. ఎన్‌సీడీ స్క్రీనింగ్, బ్లడ్ స్టోరేజీ, ఐసీటీసీ ల్యాబ్, మెడికల్ ఓపి, డెంటల్, ఇంజక్షన్ రూమ్, ఎక్స్ రే, ఆర్థోపెడిక్ ఓపి, టెక్నికల్ ల్యాబ్స్, డయాలసిస్, జనరల్ పేసెంట్స్ వార్డులు,తదితర వార్డుల ను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా డయాలసిస్ వార్డులో ఒక మహిళతో, జనరల్ వార్డులో పేషంట్లతో మంత్రి



మాట్లాడారు. ఆయా వార్డులలో పేషెంట్లకు అందుతున్న వైద్య సేవలను ఆరా తీశారు. ఎక్కడి నుంచి వచ్చారంటూ వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో డాక్టర్స్, సిబ్బంది బాగా చూస్తున్నారా? వైద్య సేవలు బాగా అందుతున్నాయా? మందులు ఇచ్చారా అంటూ వారిని ఆరా తీశారు. వారు బాగానే చూస్తున్నారని, మందులు ఇచ్చారని తెలిపారు.అక్కడే ఉన్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటలక్ష్మి కి ఆయా రోగులకు మరింత మంచి వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఆసుపత్రికి ఇంకేమైనా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అవసరం ఉంటే ప్రతిపాదనలు అందించాలని డీసీహెచ్ఎస్ సంగారెడ్డికి, ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు సూచించారు. మంత్రి వెంట జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్,శాసన సభ్యులు డా.సంజీవరెడ్డి, ఇతర ప్రజా ప్రతినిదులు,డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ గాయత్రీ దేవి, తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుని కుటుంబానికి మంత్రి పరామర్శ

నవతెలంగాణ-మునిపల్లి

మునిపల్లి మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు దివంగత కనకారెడ్డి కుమారుడు వెంకటేశ్వర్ రెడ్డి ఆకస్మికంగా మరణించారు. ఈ విషయం తెల్సుకుని కనకారెడ్డి కుటుంబాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ మంగళవారం పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులకు ఆయన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకట



లక్ష్మారెడ్డి, అందోల్ నియోజకవర్గ ఎస్సీ సెల్ కన్వీనర్, జహీరాబాద్ మాజీ ఎంపీ సురేష్ శెట్కర్, నాయకులు సురేష్, మాజీ ఎంపీపీ రాంరెడ్డి తదితరులు ఉన్నారు.

టీపీటీఎఫ్-2024 క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-సంగారెడ్డి

తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) సంగారెడ్డి జిల్లా 2024 క్యాలెండర్‌ను మంత్రి దామోదర్ రాజనర్సింహ, జిల్లా విద్యాశాఖాధికారి సుంకేషుల వెంకటేశ్వర్లు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రికి, జిల్లా విద్యాశాఖాధికారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియ జేస్తూ.. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రతి నెల మొదటి తారీఖు నాడే వేతనాలు జమ చేయాలని, పెండింగులో ఉన్న అన్ని రకాల బిల్లులను వెంటనే చెల్లించాలని ఆ యూనియన్ నాయకులు మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు వై.అశోక్ కుమార్, జిల్లా అధ్యక్షు



లు నాగారం శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచందర్, రాష్ట్ర కౌన్సిలర్లు సంజీవయ్య, లక్ష్మయ్య యాదవ్, రాజారెడ్డి, సోమశేఖర్, జీవన్‌రావ్, జాకీర్ హుస్సేన్, భా స్కర్,జిల్లా ఉపాధ్యక్షులునాసర్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

విభేదాలు వద్దు.. కలిసుందాం

ప్రజలే కేంద్రంగా పనిచేద్దాం

- దుబ్బాక అంటేనే బీఆర్ఎస్ అడ్డా
- మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

నవతెలంగాణ-దుబ్బాక

'విభేదాలు వద్దు, గ్రూపులు వద్దు కలిసుందాం... బీఆంఎస్‌ది బలమైన నాయకత్వమున్న పార్టీ ప్రజల్లో ఉంటూ వారి కష్టసుఖాల్లో అండగా ఉండండి.. మిమ్మల్ని గెలిపించే బాధ్యత నాది' అని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. దుబ్బాక ఉపఎన్నికల పరాభవం తననెంతో కలచివేసినా సాధారణ ఎన్నికల్లో కొత్త ప్రభాకర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించడం తనకు రెట్టింపు సంతోషాన్నిచ్చిందన్నారు. మంగళవారం దుబ్బాక పురపాలిక కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన బీఆర్ఎస్ కృతజ్ఞత సభకు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డితో కలిసి మాజీ మంత్రి హరీష్ రావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జయపజయాలు సాజమని పార్టీ అధికారంలో లేదని కుంగిపో వద్దన్నారు. ఓటమి అనేది స్పీడ్ బ్రేకర్ లాంటిదని తర్వాత వేగం పుంజుకున్నట్టే రెట్టింపు వేగంతో వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమేనని నొక్కి చెప్పారు. ఎమ్మె ల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ దుబ్బాక ప్రజలు కోరుకున్నట్లే అభివృద్ధి చేసే బాధ్యత తీసుకుంటానని, ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటూ పెండింగ్ పనుల పైన దృష్టి సారిస్తానన్నారు. దుబ్బాక రెవిన్యూ డివిజన్ ఏర్పాటు,



నాలుగు లైన్ల రహదారి, రింగురోడ్డు,చేగుంటలో కళాశాలలు వంటి హామీలను తప్పకుండా నెరవేస్తానని హామీ ఇచ్చారు. ఈ గెలుపు దుబ్బాక బీఆర్ఎస్ కార్యకర్తలదేనని అఖండ మెజార్టీతో తనను గెలిపించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. జెడ్పీ చైర్ పర్సన్ రోజా శర్మ, ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ గన్నె వనిత భూమిరెడ్డి,ఎంపీపీ కొత్త పుష్పలత కిషన్ రెడ్డి, జెడ్పీటీసీ రవీందర్ రెడ్డి, ఏఎంసీ చైర్ పర్సన్ చింతల జ్యోతి కృష్ణ, పీఏసీఎస్ చైర్మెన్ శేర్ల కైలాశ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కోమటిరెడ్డి వెంకట నరసింహారెడ్డి,సోలిపేట సతీష్ రెడ్డి, కోమటిరెడ్డి రజనీకాంత్ రెడ్డి, కత్తి కార్తీకగౌడ్, మనోహర్ రావు,జిల్లా గ్రంథాలయ చైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ప్రజా పాలన' అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



నవతెలంగాణ-హవేలీఘనపూర్

సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన వారందరికీ లబ్ది చేకూర్చేందుకు వీలుగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన సభలలో ప్రజలు అందించే అన్ని రకాల దరఖాస్తులను స్వీకరించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులకు సూచించారు. మంగళవారం మెదక్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని హవేలీఘనపూర్ మండలం బ్యాతోల్ గ్రామంలోని రైతు వేదికలో ఏర్పాటుచేసిన ప్రజా పాలన సభను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ నెల 6వ తేదీ వరకు ప్రజా పాలన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, దరఖాస్తుదారులు ముందస్తుగానే తమ దరఖాస్తును నింపి దరఖాస్తుల స్వీకరణ కౌంటర్లలో అందించాలని, దరఖాస్తు దారులు నిజమైన సమాచారాన్ని ఫారములో పొందుపర్చాలని, తద్వారా అర్హత గల లబ్దిదారులకు న్యాయం జరుగుతుందని తెలిపారు. మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పథకాలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ప్రజల సౌలభ్యం కోసం ఎన్ని కౌంటర్లను ఏర్పాటు చేశారు, దరఖాస్తులను అందుబాటులో ఉంచారా, దరఖాస్తులు నింపేందుకు వాలంటీర్లు, సిబ్బంది ప్రజలకు సహకారం అందిస్తున్నారా, తాగునీరు, కూర్చునేందుకు కుర్చీలు వంటి తగిన సదుపాయాలు ప్రజలకు అందుబా టులో ఉన్నాయా వంటి అంశాలను పరిశీలించారు. ఇప్పటివరకు స్వీకరించిన దరఖాస్తులు ఎన్ని, ఎక్కువగా ప్రజలు ఏ పథకం కోసం దరఖాస్తు చేస్తున్నారనే వివరాల గురించి అధికారులను ఆరా తీశారు. ఎలాంటి ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా ప్రజా పాలన కార్యక్రమాన్ని జిల్లాలో సాఫీగా నిర్వహిస్తూ పూర్తి స్థాయిలో విజయవంతం చేయాలని సూచించారు. దరఖాస్తుదా రునికి తప్పనిసరిగా రశీదును అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జయరాజ్, విజయలక్ష్మి, తహసీల్దార్, నారాయణ, సర్పంచ్ భూపాల్ రెడ్డి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సమస్యలను వెలికితీయడంలో 'నవతెలంగాణ' టాప్



నవతెలంగాణ-జహీరాబాద్

సమస్యలను వెలికి తీయడంలో నవతెలంగాణ ఎల్లవేళలా ముందువరుసలో ఉంటుందని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్యరావు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నవతెలంగాణ పత్రిక-2024 నూతన క్యాలెండర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమెల్యే మాట్లాడుతూ.. పత్రికలు ప్రజా సమస్యలను వెలికి తీయడంలో తమకంటూ ప్రత్యేకతను చాటుకుంటాయన్నారు. ఒక ఉద్దేశంతో ఏర్పడిన 'నవతెలంగాణ' పత్రిక ఆ ఉద్దేశాన్ని పూర్తిస్థాయిలో అమలు పరచాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే నవతెలంగాణ దినదినాభివృద్ధి చెందుతూ ఎన్నో సమస్యలను వెలుగు తీసేందుకు కృషి చేసిందన్నారు. ఇకముందు కూడా ఆ విధానాన్ని కొనసాగించాలని సూచించారు. నవతెలంగాణ స్టాపర్ కృష్ణ మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను వెలికి తీయడంతో పాటు అట్టడుగు వర్గాల సంక్షేమం కోసం కార్మికుల ఆశయ సాధన కోసం నవతెలంగాణ పత్రిక ఎల్లవేళలా కృషి చేస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో నవతెలంగాణ పీసీ ఇంచార్జ్ సయ్యద్ మహబూబ్ అలీ, సిబ్బంది శ్రీనివాస్, బీఎస్ఎన్ఎల్ డైరెక్టర్ శంకర్ నాయక్, ఝరసంఘం మండలాధ్యక్షులు వెంకటేశం,మాజీ పార్టీ అధ్యక్షులు సంగన్న, మాయిజ్, మోహన్, సర్పంచ్‌లు కిషన్,గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తులో రేషన్‌కార్డు ఆప్షన్ చేర్చాలి

- ఇంటి స్థలం లేని వారిని గుర్తించేలా విడిగా కాలాన్ని ఇవ్వాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు
- డీఆర్వోకి వినతి పత్రం అందజేత

నవతెలంగాణ-సంగారెడ్డి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన పేరుతో ప్రజల నుంచి స్వీకరిస్తున్న దరఖాస్తుల్లో రేషన్ కార్డు, ఇంటి స్థలం కోసం, యువ వికాసం ఆప్షన్‌ను చేర్చాలని, ప్రభుత్వమిచ్చిన ఆరు గ్యారెంటీలకు రేషన్‌కార్డు తప్పనిసరిగా ఉన్న నిబంధనలు తొలగించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఐ(ఎం) బృందం డీఆర్ఓను మంగళవారం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం జయరాజు మాట్లాడు తూ.. రేషన్ కార్డుతో సంబంధం లేకుండా ప్రజలందరికీ 6 గ్యారంటీలు పక్కాగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరా రు. అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలం ఇచ్చే విధంగా దర ఖాస్తుల్లో ఆప్షన్ లేదని.. తక్షణమే ప్రభుత్వం పంపిణీ చేస్తు న్న దరఖాస్తులో ఇంటి స్థలం కోసం కాలాన్ని కేటాయిం చాలన్నారు.



అలాగే దరఖాస్తులో వృద్ధాప్య పెన్షన్ కోసం ఎవరు నమోదు చేసుకోవాలో వయస్సు నిర్దిష్టంగా తెలుప లేదన్నారు. రైతు భరోసా పై మరింత క్లారిటీ ఇచ్చి యువ వికాసం ఆప్షన్‌ను కూడా ఈ ఆరోగ్యారెంటీల్లో చేర్చాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కొన్నిచోట్ల సరిపడా దరఖాస్తు ఫారాలు అందకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని.. ప్రజలు ఎవరు ఆందోళన చెందకుండా ఉండేందుకు ప్రభుత్వమే సరిపడ దరఖాస్తు ఫారాలు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా నాయకులు నర్సింహులు, అశోక్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్రషర్ల వాహనాలపై పోలీసు కొరడా

- జిల్లా పోలీస్ టాస్క్‌ఫోర్స్ తనిఖీలు
- పోలీసుల అదుపులో 90 టిప్పర్లు

నవతెలంగాణ-పటాన్‌చెరు

క్రషర్లలో నడిచే వాహనాలపై జిల్లా పోలీస్ టాస్క్ కొరడా ఝులిపించింది. పోలీసులు తెలిపిన వివరాల మేంకు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందం మంగళవారం పటాన్ చెరు మండలం లక్డాంం గ్రామంలోని క్రషర్ లలో నడిచే వాహనాలను (టిప్పర్లు) లక్డారం చౌరస్తా దగ్గర మరియు క్రషర్ల వద్ద తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తయారు 90 వాహనాలను (టిప్ప ర్లు)ను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ కు తరలిం చారు. పటాన్‌చెరు సీఐ లాలూనాయక్ మాట్లాడుతూ.. ఎస్పీ ఆదేశాల



మేరకు టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలు నిర్వహించడం జరిగిందన్నారు. సరైన ధృవీకరణ పత్రాలు, ఓవర్ లోడింగ్, డస్ట్ కవర్ లేని వాహనాలను అదుపులో తీసుకున్నామని.. పత్రాలను పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

గీతం అధ్యాపకులకు ప్రతిష్ఠాత్మక పరిశోధనా ప్రాజెక్టులు

నవతెలంగాణ-పటాన్‌చెరు

కేంద్ర ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక పరిశోధనా మండలి (సెర్బ్), బ్రిటీష్ కౌన్సిల్ నుంచి గీతం అధ్యాపకులు ప్రతిష్టాత్మక పరిశోధనా ప్రాజెక్టులను పొందినట్టు మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు. వంపుతిరిగిన సూక్ష్మ తలంపై తిరుగుతున్న ద్రవం అస్థిరతలపై అధ్యయనం' కోసం రూ.19.54 లక్షల పరిశోధనా గ్రాంటును స్కూల్ ఆఫ్ సైన్స్‌లోని గణిత శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ మోతహర్ రెజాకు సెర్బ్ మంజూరు చేసినట్టు తెలిపారు. సంకలిత తయారీ కోసం మిశ్రమాలు: ప్రక్రియలు, ఉత్పత్తి, రూపకల్పన, స్థిరత్వం' అనే పరిశోధనా ప్రాజెక్టు కోసం రూ.42.28 లక్షల గ్రాంటును మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జై సింగ్ కు బ్రిటీష్ కౌన్సిల్ మంజూరు చేసిందన్నారు.కిస్స్ స్పెప్టిన్ యాంటీ-మెటాస్టాటిక్ యాక్టివిటీపై' అధ్యయనం కోసం రూ.54.53 లక్షల గ్రాంటును బయోటెక్నాలజీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సీతారాం హరిహత్‌కు సెర్బ్ మంజూరు చేసినట్టు తెలిపారు. క్రోమోజోమ్ విభజన యొక్క మాలిక్యులర్ మెకానిజమ్‌ను వివరించడం' కోసం రూ.70.10 లక్షల పరిశో ధనా గ్రాంటును బయోటెక్నాలజీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి.హరినాథ్‌కు సెర్బ్ మంజూరు చేసిందన్నారు. ప్రముఖ సంస్థల నుంచి పరిశోధనకు ఆర్థిక సౌజన్యాన్ని పొందిన అధ్యాపకులను గీతం ఉపకులపతి ప్రొఫెసర్ దయానంద సిద్ధవట్టం అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఇంతటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను పొందడం, ఆయా అధ్యాపకుల విద్యా నైపుణ్యం, పరిశోధనా సామ ర్థ్యా లకు నిదర్శనంగా ఆయన అభివర్ణించినట్టు తెలిపారు. ఈ ప్రాజెక్టులు సంబంధిత రంగాలలో జ్ఞానాన్ని పెంపొందిం చు కోవడానికి మాత్రమే కాకుండా పరిశోధన, ఆవిష్కరణ సం స్కృతిని పెంపొందించడంలో గీతం నిబద్ధతకు తార్కాణమన్నారు.

అక్కమ్మ చెరువు వాగు కబ్జా..

పరిశీలించిన జిన్నారం సెక్రటరీ, ప్రజాప్రతినిధులు



నవతెలంగాణ-జిన్నారం

మండల కేంద్రమైన జిన్నారానికి చెందిన అక్కమ్మ చెరువు వాగును గోయల్ పరిశ్రమ కబ్జాకు పాల్పడుతున్నదని.. జిన్నారం గ్రామపంచాయతీ సెక్రటరీ లక్ష్మీకాంత్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ అంతిరెడ్డిగారి శ్రీనివాస్ రెడ్డి బృందం మంగళవారం ప్రత్యేకంగా పరిశీలించి అడ్డుకున్నారు. అక్కమ్మచెరువు పై రైతాంగం ఆధారపడి వ్యవసాయం చేస్తున్నదని, అక్కమ్మ చెరువులోకి వచ్చే వాగును గోయల్ పరిశ్రమ కబ్జాకు పాల్పడుతోందన్నారు. ఈ మేరకు పైపులైను మట్టి తదితరాలను పరిశీలించినట్టు చెప్పారు. కొచ్చేరువు ప్రాంతం నుంచి అక్కమ మ్మచెరువులోకి వాగు ఉందన్నారు. సంబంధిత అధికారులు వెంటనే అక్కమ్మ చెరువు వాగు కబ్జాను అరికట్టి.. కబ్జాకు పాల్పడిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

టీఎస్ జీఆర్ఈఏ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



నవతెలంగాణ-రామచంద్రాపురం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం(టీఎస్‌జీఆర్‌ఈఏ) క్యాలెండర్ మరియు డై ని పటాన్చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్ప నగేష్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు ప్రయత్నం చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు నాగభూషణం, రాములు, విశ్వనాథం, బసవరాజ్, శంకర్, వెంకటేశ్వర్లు, మోహన్ రెడ్డి, ప్రకాష్, ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన ప్రజా ప్రతినిధులు

నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌ను కలిసి పలువురు ప్రజాప్రతి నిధులు, అధికారులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సంగారెడ్డి పట్టణంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో సంగారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మెన్ ప్రభు గౌడ్, సీడీసీ చైర్మెన్ కాసాల బుచ్చిరెడ్డి, గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు నక్క నాగరాజ్ గౌడ్, డా.శ్రీహరి, రావ్ రెడ్డి, కొండల్‌రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

'ప్రజాపాలన' దరఖాస్తులపై రాజకీయం

నవతెలంగాణ-గుమ్మడిదల

ప్రజాపాలన దరఖాస్తులపై గ్రామాల్లో రాజకీయం నడుస్తోందని పలువురు ఆరోపిస్తున్నారు. కొందరు అధికార పార్టీ నాయకులు ఇంటింటికీ తిరుగుతూ.. సంక్షేమ పథకాలు ఇప్పిస్తామని ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. అంతేకాకుండా ప్రజాపాలన కార్యక్రమాల దగ్గర సైతం మభ్యపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. కాబట్టి అధికారులే నేరుగా ఇంటింటికీ తిరిగి ఈ దరఖాస్తులను అందజేయాలన్నారు. ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా ప్రజలే నేరుగా దరఖాస్తు చేసుకునేలా చూడాలని కోరారు.



టీపీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-మునిపల్లి

మండలంలోని బుదేరా వద్ద టీపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. టీపీటీఎఫ్ సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఖంరోద్దీన్, జిల్లా కౌన్సిలర్ గోవర్దన్, జిల్లా నాయకులు ప్రవీణ్‌కుమార్, సంఘం మండలాధ్యక్ష కార్యదర్శులు లక్ష్మణ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



కొనసాగుతున్న ప్రజా పాలన..

నవతెలంగాణ-జోగిపేట

అందోల్ మండల పరిధిలోని నాలుగు గ్రామాల్లో మంగళవారం ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల పరిధిలోని కంసానిపల్లి, నేరేడు గుంట గ్రామాలలో ఎంపీడీవో సత్యనారాయణ ఆధ్వర్యంలో దరఖాస్తుల కార్యక్రమాన్ని చేపట్టారు. మండల పరిధిలోని తలెల్మ , తాడ్ మన్నూరు గ్రామాలలో అందోల్ తహసీల్దార్ ఆంటోనీ ఆధ్వర్యంలో దరఖాస్తుల కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామాల్లో జరుగుతున్న దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని మండల స్పెషల్ ఆఫీసర్ గీత పర్యవేక్షించారు. లబ్ధిదారుల నుంచి అభయాసం 6 గ్యారంటీ పథకాలకు దరఖాస్తులు తీసుకున్నారు. ఈ కార్యక్రమాలలో ఆయా గ్రామాల సర్పంచులు జి. లింగాగౌడ్ (తలేల్మా), కోటి రెడ్డి గారి సంగీత అనిల్ రెడ్డి (తాడు మన్నూర్), యాదగౌడ్ (కంసాన్పల్లి), చందులతా మల్లప్ప (నేరడి గుంట), ఉప తహసిల్దార్ మధుకర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి విజయరత్న, ఏపీఎం మాణిక్యం, ఆయా గ్రామాల నాయకులు ప్రవీణ్ కుమార్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



ఇరుముడితో శబరిమలకు అయ్యప్ప స్వాములు

నవతెలంగాణ-హత్నూర

మండలంలోని మల్కాపూర్ గ్రామం నుంచి అయ్యప్ప స్వాములు ఇరుముడితో శబరిమలకు మంగళవారం బయలుదేరారు. ఈ సందర్భంగా సర్పచుల ఫోరమ్ మండల అధ్యక్షులు, మల్కాపూర్ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, గురుస్వామి, దామోదర్ రెడ్డి గురుస్వామి, ఇరుముడి కట్టుకున్న మాల దారుణ దీక్ష స్వాములు కిషోర్ స్వామి, నరేందర్ రెడ్డి స్వామి, మహేష్ స్వామి అయ్యప్ప శబరియాత్ర సన్నిధికి బయలుదేరారు. అంతకు ముందు అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజ గణపతి హెూమం, అయ్యప్ప పూజ, ఇరుముడి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం నెయ్యి అభిషేకంలో చేపట్టారు. ఈ కార్యక్రమానికి అయ్యప్ప స్వామి మాల ధారణ స్వాములు భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు.



జోగిపేట : జోగిపేట నుంచి అయ్యప్ప స్వాములు మంగళవారం శబరిమలైలోని అయ్యప్ప స్వామిని దర్శించుకునేందుకు మంగళవారం బయలుదేరారు. హౌసింగ్‌బోర్డు వద్ద గల ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయంలో 27 మంది అయ్యప్ప స్వాములకు గురుస్వాములు దేవరశెట్టి సంతోష్‌కుమార్, అనంత రాజ్, కిరణ్, రామకృష్ణ స్వాములు ఇరుముడిలను కట్టారు. ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను చేపట్టారు. మాజీ కౌన్సిలర్ పులుగు.గోపాల్ కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆలయంలో పడిపూజను నిర్వహించారు. జోగిపేట ఎస్ఐ అరుణ్‌కుమార్ ఏఎస్ఐ అంజయ్య, జోగిపేట కౌన్సిలర్లు యస్. సురేందర్ గౌడ్, ఆకుల చిట్టిబాబు, రంగ సురేష్, కోరబోయిన నాగరాజు, చందర్, పట్లోళ్ల రేఖా ప్రవీణ్, ఆలయంలో పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి సంతోష్ ఆధ్వర్యంలో పూజలను నిర్వహించారు. అయ్యప్ప స్వాములు ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న వాహనాల్లో శబరిమలై యాత్రకు తరలివెళ్లారు.

అర్హులందరూ 'ప్రజాపాలన'కు దరఖాస్తు చేసుకోవాలి

- పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి
- కొనసాగుతున్న దరఖాస్తుల స్వీకరణ.. పలు గ్రామాల్లో అపూర్వ స్పందన



నవతెలంగాణ-అమీన్‌పూర్

ప్రజా పాలన కార్యక్రమంలో నూతన సంక్షేమ పథకాల కోసం అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని 10, 20 వార్డుల్లో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డితో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 6 గ్యారంటీల అమలులో భాగంగా వివిధ సంక్షేమ పథకాల కోసం ప్రజల నుండి దరఖాస్తుల స్వీకరించడం జరుగుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజా సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వానికి సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ వైస్ చైర్మెన్ నరసింహ గౌడ్, కమిషనర్ జ్యోతి రెడ్డి, కౌన్సిలర్లు బాలమని బాలరాజు, అనిరుధ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుల్కల్ : మండల పరిధిలోని పుల్కల్, ముదిమాణిక్యం, పెద్దారెడ్డిపేట, పోచారం, చౌటకుర్ మండల పరిధిలోని లింగంపల్లి వెండికోల్ గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమాలకు అపూర్వ స్పందన వచ్చినట్టు సంబంధిత అధికారులు తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి వారికి కావాల్సిన సంక్షేమ పథకాలను దరఖాస్తు ఫారంలో నింపి.. అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పుల్కల్ తాసిల్దార్ భాస్కర్ కుమార్, ఎంపీడీవో విజయలక్ష్మి, చౌటకుర్ మండల తహసిల్దార్ ఈశ్వరి రాణి, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, అంగన్వాడి సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిన్నారం : మండలంలోని సోలక్‌పల్లి, మంగంపేట గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన నాలుగురోజు ప్రజాపాలన కార్యక్రమాలకు సంగారెడ్డి జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కుంచాల ప్రభాకర్, జిన్నారం ఎంపీపీ రవీందర్ గౌడ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలన్నీ ప్రతీ గడపకు అందేలా కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు దాసరి శ్రీకాంత్ రెడ్డి, ప్రశాంతి నరేందర్, జిన్నారం తహసీల్దార్ రవికుమార్, జిన్నారం ఎంపీడీవో రాములు, నాయ కులు ఇమామ్ నగర్ మల్లేష్, గోపాల్‌రెడ్డి, కృష్ణ శాంతవర్మ రెడ్డి, ఎంపీటీసీ స్వాతి ప్రభాకర్ రెడ్డి, ఉపసర్పంచ్ నక్క నాగరాజు, జిన్నారం మండల విద్యుత్తు శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ రాజు, ఎంపీఓ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.





పర్యవేక్షించిన ఆర్డీవో..



నవతెలంగాణ-మునిపల్లి

మండలంలోని లింగంపలి,బోడిషట్‌పల్లి, గొర్రెగట్టు గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్(ఆర్డీఓ) రవీందర్‌రెడ్డి, జెడ్పీ సీఈవో ఎల్లయ్య పాల్గొన్నారు. సందర్భంగా దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ప్రజలందరికి దరఖాస్తు పారలు అందే విధంగా చూడాలని, ఎవరికి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ రమాచారి, సర్పంచ్ జయరంజని, వెంకటేష్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి శబ్నం ఆలియా, మాజీ జడ్పీటీసీ మీర్ ఇలాల్ రజియుదిన్ (అసత్‌పటేల్) తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సరిపడా దరఖాస్తులు అందజేయాలి



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పట్టణంలో ప్రజలందరికీ సరిపడా ప్రజాపాలన దరఖాస్తు పత్రాలను అందించాలని సీపీఐ(ఎం) నాయకులు ఎస్ మహిపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక మున్సిపల్ కమిషనర్‌కు మంగళవారం మెమోరాండం అందించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజలందరికీ సరిపడా దరఖాస్తులు అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాబట్టి ఎలాంటి కొరత లేకుండా 'ప్రజాపాలన' దరఖాస్తు పత్రాలను ప్రజలందరికీ అందుబాటులో ఉంచాలన్నారు. మున్సిపాల్టీలో అదనపు కౌంటర్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సలీముద్దీన్‌రాజు,రాములు,చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ కోసం పాట్లు..

- ట్యాంకర్ల సమ్మెతో బంకుల్లో కొరత
- తీవ్ర ఇబ్బందులు పడిన వాహనదారులు



నవతెలంగాణ-పుల్కల్

పుల్కల్ ఉమ్మడి మండలంలో పెట్రోల్ కోసం మంగళవారం వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ట్యాంకర్ల సమ్మెతో ఏ బంకులో చూసినా.. నోస్టాక్ బోర్డులే వెలిశాయి. దాంతో వాహనదారులు నానా అవస్థలు పడ్డారు.

ఉమ్మడి పుల్కల్ మండలంలో ఆరు పెట్రోల్ బంకులు ఉన్నాయి. అయితే పెట్రోల్ ట్యాంకర్ల సమ్మెతో ఈ బంకులన్నింటిలో స్టాక్ లేకుండా పోయింది. అయితే ముందస్తు సమాచారం లేకుండా.. అకస్మాత్తుగా వెలిసిన నో-స్టాక్ బోర్డులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పెట్రోల్ లేక కొందరు తమ వ్యాపారాలను కూడా బందుపెట్టుకున్నారు. రైతుల దగ్గరి నుంచి మొదలుకుని.. ఉద్యోగుల వరకూ అందరూ ఇబ్బందులు పడ్డారు. కాగా బంక్ యాజమాన్యం ముందురోజు సమాచారం ఇస్తే.. ఇలా ఇబ్బంది పడేవాళ్లం కాదని వాహనదారులు వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి.. బంకుల్లో స్టాక్ వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గ్రామీణ స్థాయిలో లయన్స్ క్లబ్ సేవలు విస్తరించాలి



నవతెలంగాణ-జోగిపేట

గ్రామీణ స్థాయిలో లయన్స్ క్లబ్ పరిధిలో సేవా కార్యక్రమాలను విస్తరించాలని ఆ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ డాక్టర్ ఘట్టమనేని బాబూరావు సూచించారు. మాజీ లయన్స్ క్లబ్ గవర్నర్ డాక్టర్ ఎస్.రవీందర్‌గౌడ్, జిల్లా క్లబ్ సెక్రటరీలు డాక్టర్ అనంతరెడ్డి, ఎస్.జగన్మోహన్‌రెడ్డి, జిల్లా పర్సన్ ఇంచార్జి ఆకుల రాంబాబు ఆధ్వర్యంలో హైద్రాబాద్‌లోని స్వగృహంలో వారిని మంగళవారం కలిసారు. ఈ సందర్భంగా బాబూరావు క్లబ్ నిర్వాహణపై పలు సూచనలు చేశారు. సభ్యులు సకాలంలో క్లబ్బు సభ్యత్వ ఫీజులు చెల్లించేలా సమావేశాలు నిర్వహించుకొని సూచించాలన్నారు. క్లబ్‌లో సభ్యులను చేర్పించే సమయంలో క్లబ్ నిబంధనలను కూడా తెలియజేయా లన్నారు. నిస్వార్థంగా సేవ చేయడమే లక్ష్యం పెట్టుకోవాలని, సకాలంలో సభ్యత్వ రుసుములు చెల్లించేలా అవగాహన కల్పించాలన్నారు.

ప్రజాసమస్య వెలికితీతలో 'నవతెలంగాణ' ముందంజ

తహసీల్దార్ గౌరీవత్సల.. నవతెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-అమీన్‌పూర్

ప్రజా సమస్యలను వెలుగులోకి తేవడంలో నవతెలంగాణ దినపత్రిక ముందుంటుందని అమీన్‌పూర్ తహ సీల్దార్ గౌరీవత్సల అన్నారు. తహసీల్దార్ ఛాంబర్‌లో నవతెలంగాణ దినపత్రిక నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ గౌరీవత్సల మాట్లాడుతూ.. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య నవతెలంగాణ వారధిలా పనిచేస్తున్నదని, భవిష్యత్తులోనూ అదేవిధంగా ముందుకు సాగాలన్నారు. సమాజంలో పత్రికలకు మంచి విలువ ఉందని, ఏలాంటి సమస్యనైనా వెలుగులోకి తేచ్చేందుకు పత్రికా యాజమాన్యాలు పనిచేయడం శుభపరిణామమన్నారు. ప్రజల పక్షాన నిలిచే నవతెలంగాణ దినపత్రిక ఎల్లప్పుడూ పాఠక ఆదరణ కొనసాగిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ క్యాలెండర్ ఆవిష్కరణలో నవతెలంగాణ అమీన్‌పూర్ రిపోర్టర్ బాదిని శ్రీనుతదితరులు పాల్గొన్నారు.

హార్డ్వేర్ అండ్ శానిటరీ షాప్ ప్రారంభోత్సవం



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

మున్సిపల్‌లో ఏర్పాటు చేసిన హార్డ్వేర్‌అండ్ శానిటరీ నూతన దుకాణాన్ని డీసీసీ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్ర శేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై.. రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా యజమానులకు, వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాశీనాథ్ పటేల్, మోయిన్, షారుఖ్ ఖాన్, రాజు యూత్ నాయకులు, మోయిన్ సౌదీ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్

- వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండా వసతుల కల్పనకు పెద్దపీట
- పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



నవతెలంగాణ-పటాన్‌చెరు

పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్.. ఆదాయంలో ఉమ్మడి మెదక్ జిల్లాలోనే మొదటి స్థానంలో నిలవటం గర్వ కారణంగా ఉందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్మెన్ విజయ్ కుమార్ అధ్యక్షతన మంగళవారం జరిగిన పాలక మండలి సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 14 ఎకరాల విస్తీర్ణంలో మార్కెట్ ను ప్రణాళికబద్ధంగా అభివృద్ధి పథంలో తీసుకుని వెళుతున్నామని తెలిపారు. ఇటీవల రూ.23 కోట్లతో 160 దుకాణ సముదాయాల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశామన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ఐదు కోట్ల రూపాయల లక్ష్యాన్ని ఇప్పటికే సాధించడం జరిగిందన్నారు. రైతులకు కొనుగోలుదారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తిస్థాయిలో వసతులు కల్పిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో వైస్ చైర్మెన్ మల్లారెడ్డి, డైరెక్టర్లు, మార్కెటింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

బొల్లారంలో నూతన జిమ్ ప్రారంభం

- ముఖ్య అతిథిగా బొల్లారం మున్సిపల్ వైస్ చైర్మెన్ అంతిరెడ్డిగారి అనిల్ కుమార్‌రెడ్డి



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

పటాన్‌చెరు నియోజకవర్గం మున్సిపల్ పరిధిలో షేక్ మూబిన్ ఆధ్వర్యంలో న్యూ మాక్స్ ఫిట్నెస్ యూనిసెక్స్ జిమ్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, బొల్లారం మున్సిపల్ వైస్ చైర్మెన్ అంతిరెడ్డిగారి అనిల్ కుమార్ రెడ్డి, విశిష్ట అతిథి తెలంగాణ రాష్ట్ర బాడీబిల్డింగ్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మిస్టర్ ఇండియా బాడీబిల్డింగ్ శ్రీ మొహమ్మద్ నవాజ్‌లు హాజరై.. రిబ్బన్ కట్ చేసి జిమ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారిని జిమ్ నిర్వాహకులు శాలువా, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బొల్లారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంతిరెడ్డిగారి బాల సుబ్రమణ్యరెడ్డి, బీసీ సెల్ అధ్యక్షులు కాటారం శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పుల్ల గూర్ల శ్రీనివాస్‌రెడ్డి, తూపల్లి రాజశేఖర్ రెడ్డి, పెద్ద వెంకటయ్య, ఈశ్వర్ రావు, రాజిరెడ్డి, మార్ల గోపి, మధు, ఈశ్వర్‌రావు, యూత్ కాంగ్రెస్ కాశిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, మోజేష్, బస్వరాజ్,రవి, జిమ్ సభ్యులు షేక్ వసీమ్, షేక్ మోసిన్, షేక్ ఫహీం,షేక్ అమీర్ తదితరులు పాల్గొన్నారు.

పదిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి..



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

10వ తరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధాన-ఉపాధ్యాయుడు మంగీలాల్ అన్నారు. బొల్లారం జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులకు లేబర్ హాలిడేను పురస్కరించుకొని మంగళవారం సమావేశం నిర్వహించారు. 2024 మార్చి 18నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఉన్నాయన్నారు. కాబట్టి పిల్లల కు ఎలాంటి పనులు చెప్పకుండా చదువుకోనియ్యాలన్నారు. ఈ మేరకు ప్రతిజ్ఞ కూడా చేయించారు. సబ్జెక్టు టీచర్స్‌తో పిల్లల ప్రగతిని వివరించారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ మరకత మల్లికార్జున స్వామి ఆలయంలో ఘనంగా నాగవెల్లి

నవ తెలంగాణ-నర్సాపూర్



నర్సాపూర్ యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీ కేతకి భ్రమరాంబికా సహిత మరకత మల్లికార్జున స్వామి ఆలయంలో ఆలయ వార్షిక మహోత్సవాలు గత మూడు రోజులుగా ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజున గంగ పటం నిర్వహించగా రెండవ రోజు ఉత్సవాల నిర్వాహకులు మాచినూరి మల్లేష్ యాదవ్, శంకరయ్య దంపతుల ఆధ్వర్యంలో ఆలయ పూజారి వేద పండితులు హరి ప్రసాద్ శర్మ వేదమంత్రాలతో రుద్ర హోమం నిర్వహించారు. కాగా మూడవ రోజున మల్లికార్జున స్వామి కళ్యాణం అగ్నిగుండాలు, బోనాలు, మంగళ హారతి తదితర పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మంగళవారం శ్రీ మల్లికార్జున స్వామి నాగవెల్లి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. నిర్వాహకులు మాచునూరి మల్లేష్ యాదవ్, శంకరయ్య యాదవ్, రాజు యాదవ్, రమేష్ యాదవ్, మల్లేష్ యాదవ్, లక్ష్మణ్ యాదవ్, శ్రీశైలం యాదవ్, చంద్రయ్య యాదవ్, మల్లేష్ యాదవ్, సురేష్ యాదవ్, ఎద్దు రమేష్ యాదవ్, యాదవ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సావిత్రీ బాయి పూలే పోరాట పటిమను ఆదర్శంగా తీసుకోవాలి

నవతెలంగాణ-నార్సింగి



సావిత్రీ బాయి పూలే పోరాట పటిమను ఆదర్శంగా తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ మెదక్ జిల్లా బాధ్యుడు జగన్ అన్నారు. బుధవారం సావిత్రీ బాయి పూలే 193వ జయంతి సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సెమినార్ నిర్వహించారు. సావిత్రి బాయి చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం ఈ సెమినార్ లో మహిళలపై జరుగుతున్న దాడులపై ఎస్ఎఫ్ఐ మెదక్ బాధ్యుడు జగన్ మాట్లాడారు. భారత దేశపు మొట్టమొదటి ఉపాధ్యాయురాలు సావిత్రీ బాయి పూలే అని, స్త్రీ ల విముక్తి, అంటరాని తనానికి వ్యతిరేకంగా పోరాడిన యోధురాలన్నారు. ఆమె ఆశయాల సాధన కోసం పోరాడుదామన్నారు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా లక్ష్య సాధనలో ముందుకు సాగిన యోధురాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు విష్ణు, వేణు, రాజు, కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి సమిష్టి కృషి చేద్దాం: కలెక్టర్ రాజర్షి షా

నవతెలంగాణ-మెదక్



జిల్లా అధికార యంత్రాంగం సమిష్టిగా పనిచేసి జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేద్దామని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఆంగ్ల నూతన సంవత్సరాది సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్లు రమేష్, వెంకటేశ్వర్లు, అదనపు జిల్లా ఎస్పీ మహేంధర్, డిఆర్ఓ పద్మశ్రీ, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బందితో కలిసి మంగళవారం కలెక్టరేట్ భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ రాజర్షిషాకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికార యంత్రాంగం అంకితభావంతో సమిష్టిగా కృషిచేసి జిల్లా అభివృద్ధికి దోహదపడాలన్నారు. మునిసిపల్ చైర్మన్ చంద్రపాల్, టిఎన్జిఓ జిల్లా అధ్యక్షులు నరేందర్ కలెక్టర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు శ్రీనివాస్, రవి ప్రసాద్, జయరాజ్, విజయలక్ష్మి, బ్రహ్మాజీ, రజాక్, హరిబాబు, బ్రహ్మారావు, ఇందిర, జయచంద్ర, మునిసిపల్ కమిషనర్లు జానకిరామ్ సాగర్, వెంకట గోపాల్, వివిధ శాఖల అధికారులు , టిఎన్జిఓస్ కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలతో లబ్ది పొందాలి

రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్యాల్ మహిపాల్‌రెడ్డి



నవతెలంగాణ/తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం అభయ హస్తంలో బాగంగా ఆరు గ్యారెంటీలను ప్రజలు ఉపయోగించుకుని లబ్దిపొంది ఆర్థికంగా అభివృద్ధి చెందాలని రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్యాల్ మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో బాగంగా మంగళవారం మండలంలోని మనోహరాబాద్, వెంకటాపూర్ అగ్రహారం, రంగాయిపల్లి, రామాయిపల్లి గ్రామాలలో గ్రామ సభలను నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు రాష్ట్ర ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాస్‌రావ్, డిప్యూటీ తహశీల్దార్ కౌశిక, వ్యవసాయ శాక ఏఈ స్రవంతి, ఆర్ఐతో పాటు ఎంపీటీసి పొట్టోల్ల లత వెంకట్‌గౌడ్, నాయకులు శోభన్‌రాజ్‌గౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ జావీద్ పాషా, పలు శాఖల అధికారులు కార్యదర్శి రూపాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గజిటెడ్ లెక్చరర్ల సంఘం జిల్లా అధ్యక్షుడుగా శ్రీనివాస్

నవతెలంగాణ-పాపన్నపేట



తెలంగాణ గజిటేడ్ లెక్చరర్ సంఘం 711 మెదక్ జిల్లా అధ్యక్షుడిగా గాండ్ల శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా సురేందర్ ఎన్నికయ్యారు. శ్రీనివాస్ పాపన్నపేట జూనియర్ కళాశాలలో వృక్ష శాస్త్ర అధ్యాపకులుగా పనిచేస్తున్నారు. సురేందర్ కౌడిపల్లి జూనియర్ కళాశాలలో రసాయనశాస్త్రం అధ్యాపకులుగా పనిచేస్తున్నారు. వీరు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రాష్ట్ర అధ్యక్షుడు కనక చంద్రం తెలిపారు. లెక్చరర్స్ సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తామని. శ్రీనివాస్, సురేందర్‌లు వెల్లడించారు.

సంపదను పెంచి పేదలకు పంచడమే లక్ష్యం

రంగంపేట ప్రజాపాలనలో ఆవుల రాజిరెడ్డి


నవతెలంగాణ-కొల్చారం



సంపదను పెంచి పేదలకు పంచడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని రంగంపేట గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన దరఖాస్తుదారులను ఉద్దేశించి మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించడం చారిత్రాత్మక ఘట్టమన్నారు. ప్రజా పలన ద్వారాపేద పేద ప్రజలకు ఎంతో లబ్ది చేకూరుతుందన్నారు. అలాగే ఎన్నికల్లో హామీ ఇచ్చిన 6 గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తామని తద్వారా ఎంతో మంది పేద ప్రజలకు లబ్ది చేకూరుతుందన్నారు. సంపదనుపెంచే దిశగా, ఆర్థిక వనరులను కాపాడుకునే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు పోతుందన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు నాగులగారి మల్లేశం గౌడ్, పంచాయతీ కార్యదర్శి ప్రియాంక, తహశీల్దార్ మహ్మద్ గఫ్ఫార్, డిప్యూటీ తహశీల్దార్ నాగవర్ధన్, ఏఈవోలు నిరోష, రోజా, సీనియర్ నాయకులు పోతిరెడ్డిపల్లి చంద్రశేఖర్ రెడ్డి, సుధీర్ రెడ్డి, రాంపూర్ సర్పంచ్ రాంరెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు దర్గి రాజు, దేవన్న గారి శేఖర్, బండి మల్లేశం, గొండ కృష్ణ, పాడెపు నాగరాజు, చాకలి రమేష్, కోనాపూరం సిద్ది రాములు, ప్రవీణ్ రెడ్డి, చిలుక నాగరాజు, బీఆర్ఎస్ నాయుడు బండి రమేష్,గాండ్ల కృష్ణ, ఆగంగౌడ్, శ్రీశైలం, తుక్కాపూర్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి


నవతెలంగాణ - మెదక్



సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలని ఉమ్మడి మెదక్ జిల్లా గోర్ సేనా కో ఆర్డినేటర్ రమేశ్ నాయక్ రాథోడ్ పేర్కొన్నారు. మంగళవారం మెదక్ కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజర్షి షాను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో 40 నుంచి 50 లక్షల జనాభా కలిగి ఉన్న గోర్ బంజారాల ఆరాధ్య దైవం క్రాంతి కారి సత్గురు సేవాలాల్ మహారాజ్ జయంతిని ఫిబ్రవరి 15న సాధారణ సెలవుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ల ద్వారా తెలంగాణ ముఖ్యమంత్రికి తెలియజేయడం జరుగుతుందన్నారు. ఫిబ్రవరి 15న సాధారణ సెలవు దినంగా ప్రకటించని యెడల రాష్ట్ర వ్యాప్తంగా భారీ ఆందోళనలు, రాస్తారోకోలు, ముట్టడి కార్యక్రమాలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దేవిదాస్ రాథోడ్, లక్ష్మణ, రామ్,ప్రేమ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-వెల్దుర్తి



కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను తూచా తప్పకుండా అమలు చేస్తుందని, ప్రజలు అధైర్య పడకుండా సద్విని చేసుకోవాలని నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి సూచించారు. మంగళవారం మండల పరిధిలో దాపరచ కుకునూరు శెట్టిపల్లి రామయ్య పల్లి పలు గ్రామాల్లో అభయహస్తం కార్యక్రమాన్ని ఆయా గ్రామాల సర్పంచులు, అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆవుల రాజిరెడ్డి మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలందరికీ అందే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రమేష్ గౌడ్ కాంగ్రెస్ జిల్లా నాయకుడు నరేందర్ రెడ్డి తలారి మల్లేష్ అన్వేష్ నరసింహారెడ్డి వెంకట్ రెడ్డి ఆర్ఐ జై భారత్ రెడ్డి అధికారులు ప్రజాప్రతినిధులు ఉన్నారు.

పనులు కావాలంటే పైసలివ్వాల్సిందే..!

- ప్రతీ పనికొక రేటు ఫిక్స్
- హుకుం జారీ చేసిన పైతర పంచాయతీ కార్యదర్శి

నవతెలంగాణ- కొల్చారం



పనులు కావాలంటే పైసలివ్వాల్సిందే.. ప్రతి పనికొక రేటు ఆ ప్రకారమే లంచం ఇవ్వాల్సిందేనని పైతర గ్రామపంచాయతీ కార్యదర్శి హుకుం జారీ చేశారు. పైతర గ్రామపంచాయతీ కార్యాలయంలో అవినీతి లీలలు బహిరంగంగానే కొనసాగుతున్నాయి. గ్రామ ప్రజలకు జవాబుదారీతనంగా ఉంటూ పారదర్శకంగా పనిచేయాల్సిన పంచాయితీ కార్యదర్శి పైసలు ఇస్తే తప్ప పనిచేయట్లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రతి ష్టాత్మకమైన ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయాల్సింది పోయి అక్రమ వసూళ్లకు తెరలేపుతున్నట్లు సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఆయన చేసిన అక్రమ వసూళ్లను చూస్తే ఎవరైనా ఆశ్చర్య పోవాల్సిందే.. పెన్షన్ మంజూరు చేయాలన్నా, ఇంటి నెంబర్ ఇవ్వాలన్నా, గృహ నిర్మాణాలకు అనుమతులు, జనన, మరణ ధృవీ కరణ పత్రాలు కావాలన్నా ఆయన అడిగినంత ఇవ్వాల్సిందే. లేదంటే ఫైల్ ముందుకు కదలదు. ఏదోఒక సాకుతో కాలం విల్లదీస్తాడు. పలు రకాల కారణాలు చూపి సంబంధిత దరఖాస్తులను తిరస్కరిస్తుంది. ప్రతి పనికి ఒక రేటు గ్రామంలో పలు పనుల నిమిత్తం పంచాయితీ కార్యాలయానికి వచ్చే బాధితులకు, వాటి పనిని బట్టి పనికొక రేటును నిర్ణయించి ఆ రేటు ప్రకారమే పనిచేస్తాడు. ప్రజలకు కావాల్సిన న్యాయబద్ధమైన పని చేయాలంటే కచ్చితంగా ఆయన అడిగినంత ముట్ట చెప్పాల్సిందేనని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తుల నుంచి లంచం తీసుకోవడమే పెద్ద నేరం, ఓ వైపు అవినీతి అక్రమాలకు పాల్పడుతూనే ప్రజలపై జులుం ప్రదర్శిస్తుంటారు. మరోపక్క బాధితులతో బెదిరింపులకు గురిచేస్తాడని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి అక్రమాలకు పాల్పడుతున్న పంచాయతీ కార్యదర్శిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కళ్యాణ లక్ష్మీ కోసం రూ.30 వేలు అడుగుతుండు

- మిద్దె నర్సింలు, పైతర



కల్యాణ లక్ష్మి కోసం ఏడాది క్రితం దరఖాస్తు చేసుకున్న. ఇప్పటివరకు కల్యాణ లక్ష్మి రాలేదు. పంచాయతీ కార్యదర్శిని అడిగితే నీ కాగితాలు దొరకడం లేదని చెప్తున్నాడు. రూ.30 వేలు లంచం ఇస్తే కల్యాణ లక్ష్మి ఇప్పిస్తానని చెప్తున్నాడు. రూ.30వేలు ఇచ్చే ఆర్థిక స్తోమత తనకు లేదు. దయచేసి కళ్యాణ లక్ష్మి ఇప్పించగలరని కోరుతున్న.

ప్రజల ఆరోపణలు అవాస్తవం

- పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్



అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నానని ప్రజలు ఆరోపించడం అవాస్తవం. ఎక్కడ కూడా లంచాలు తీసుకుని పనిచేయలేదు. బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తిస్తున్నా..

ఆరు గ్యారంటీ పథకాలు కచ్చితంగా అమలు చేయాలి

- ప్రజాపాలనలో ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి

నవతెలంగాణ-కౌడిపల్లి

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం కచ్చితంగా అమలు చేయాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని మూత్రాజ్ పల్లి, మమ్మద్ నగర్, మనంతాయపల్లి తండా, మర్రిచెట్టు తండా గ్రామాలలో ప్రజా పాలనలో భాగంగా ఆరు గ్యారెంటీల దరఖాస్తుల స్వీకరణకు గ్రామసభలు ఆయా గ్రామాల సర్పంచ్‌ల అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ గ్రామ సభలకు ముఖ్యఅతిథిగా నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి హాజరై కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సమావేశంలో సునీతా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా 6 గ్యారెంటీలను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. పారదర్శక పాలనకు తామెప్పుడూ సహకరిస్తామని ప్రజలకు ఉపయోగపడే మంచి పనులను సహృదయంతో స్వాగతిస్తామన్నారు. అర్హులైన వారందరికీ 6 గ్యారెంటీ పథకాలు అందించాలన్నారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసమే బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేగా తనను ఎన్నుకున్నారన్నారు. ప్రజల సమస్యలను తీర్చేందుకు అహర్నిశలు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఇప్పటికే కొన్ని వాగ్దానాలు విస్మరించిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే డిసెంబర్ 9న రైతులకు రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తామని ప్రకటించి ఇప్పటి వరకు చేయలేదన్నారు. అలాగే రైతు భరోసా, యాసంగి పంటలు ప్రారంభమైనప్పటికీ పూర్తిస్థాయిలో రైతుల ఖాతాల్లోకి డబ్బులు రాలేవన్నారు. రైతులకు గిట్టుబాటు ధరతోపాటు క్వింటాలుకు రూ.500ల బోనస్ ఇవ్వలేదని స్పష్టం చేశారు. ఇలా మాట తప్పకుండా ఆరు గ్యారెంటీలు మాత్రం కచ్చితంగా అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రజలు ఆరు గ్యారంటీల అమలు దరఖాస్తులు అందుబాటులో లేని ఇవ్వనివారు అధైర్యపడవద్దని ఆరవ తేదీ వరకు ఆయా గ్రామాల సంబంధిత అధికారులకు అందజేయవచ్చని సూచించారు. కొత్త రేషన్ కార్డు మంజూరు కోసం వైట్ పేపర్‌పై కుటుంబ సభ్యుల ఆధార్ కార్డుల జిరాక్సులతను జత చేసి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అనంతరం ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షులు గుంజరి ప్రవీణ్ కుమార్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డికి శాలువా కప్పి సన్మానించారు.



ఈ కార్యక్రమంలో డీఈవో రాధా కిషన్, జెడ్పీటీసీ కవిత అమర్ సింగ్, ఎంపీపీ రాజు నాయక్, ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ ఆంజనేయులు, డిప్యూటీ తహసీల్దార్ తారాబాయి , సర్పంచులు దివ్య మహిపాల్ రెడ్డి , సంజీవ్, జీవుల నాయక్, బుజ్జి హల్యా నాయక్, ఎల్లం, ఐకెపి ఏపీఎం సంగమేశ్వర్, ఎంపీఓ పుణ్యదాస్, ఏఈ కోటేశ్వర్ రావు, హెల్త్ సూపర్వైజర్ రమేష్, ఐసిడిఎస్ సూపర్వైజర్ శశికళ, లక్ష్మి ఆర్ఐ శ్రీహరి, నాగసన్ పల్లి సర్పంచ్ ఎల్లం, సోషల్ మీడియా వారియర్స్ ప్రతాప్ గౌడ్, ఆంజనేయులు, నర్సింలు, రాజు, మాణిక్య రెడ్డి, ఆయా గ్రామానికి చెందిన అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకుల్లో వాహనదారుల క్యూ









నవతెలంగాణ-మెదక్ : కేంద్రం తీసుకొచ్చిన హిట్ అండ్ రన్ వాహన చట్టాన్ని వ్యతిరేకిస్తూ ట్రక్కు డ్రైవర్ల సమ్మెతో పెట్రోల్ బంకులను బంద్ పెట్టనున్నట్లు వస్తున్న వార్తల నేపథ్యంలో మంగళవారం మెదక్ జిల్లాలోని పెట్రోల్ బంకుల్లో వాహనదారులు క్యూ కట్టారు. పెట్రోల్, డీజిల్‌లను వాహనాల్లో ట్యాంక్ ఫుల్ చేయించుకోవడంతో పలుచోట్ల బ్యాంకుల యజమానులు నో స్టాక్ బోర్డులు పెట్టారు. బంకుల్లో రద్దీ కారణంగా పెట్రోల్, డీజిల్ కోసం వాహనదారులు గంటలతరబడి నిలబడి అవస్థలు పడాల్సి వచ్చింది. దాదాపు అన్ని పెట్రోల్ బంకుల్లో వాహనదారుల రద్దీ ఏర్పడింది. దీంతో పలు చోట్ల ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

నవ తెలంగాణ-నర్సాపూర్ : నర్సాపూర్ పట్టణంలోని పెట్రోల్ బంకుల్లో వాహనదారులు బారులు తీరారు. డిజిల్ పెట్రోలును తీసుకువచ్చే ట్యాంకర్ డ్రైవర్లు కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన చట్టాన్ని వ్యతిరేకిస్తూ సమ్మె చేపట్టిన విషయం తెలిసిందే. దీంతో పెట్రోల్ డీజిల్ కొరతతో జనం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మంగళవారం అన్ని పెట్రోల్ బంకుల్లో డీజిల్ కొరత ఏర్పడింది. పెట్రోలు ఉన్న లైన్లో నిలబడి వాహన దారులు బారులు తీరారు. హైదరాబాద్ వెళ్లే మార్గంలో ఉన్న ఆర్టీసీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పెట్రోల్ బంకు వద్ద రోడ్డుపై రైతులు ధర్నా చేపట్టడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. నర్సాపూర్‌లో కొన్ని పెట్రోల్ బంకులలో డీజిల్, పెట్రోల్ అయిపోయిందని లోపలికి వాహనాలు రాకుండా కట్టెలు అడ్డం పెట్టుకొని పెట్రోల్ బంక్ యజమానులు పెట్రోల్, డీజిల్ పోయడం నిలిపివేశారు. దీంతో వాహనదారులు పెట్రోల్ బంకుల వద్ద బారులు తీరారు.

నవతెలంగాణ-నిజాంపేట : పెట్రోలు ట్యాంకర్ల స్ట్రైక్ తో పెట్రోల్ బంకుల వద్ద వాహనదారులు ఎగబడి క్యూలో నిలబడుతున్నారు. పెట్రోలు దొరకదనే భయంతో ట్రాక్టర్, ద్విచక్ర వాహనదారులు పెట్రోల్ బంకుల వద్ద గుమిగూడి నిలబడుతూ పెట్రోల్ బంకు నిర్వాహకులతో కొట్లాటకు దిగుతున్నారు. పెట్రోల్ బంకు నిర్వాహకులు పోలీసులను పిలిపించారు. ఎస్సై శ్రీనివాస్ రెడ్డి తన సిబ్బందితో పెట్రోల్ బంక్ వద్దకు చేరుకునివాహనదారులకు సర్ది చెప్పారు.

నవ తెలంగాణ-సిద్దిపేట : ఆయిల్ ట్యాంకర్‌ల డ్రైవర్‌లు సమ్మె చేస్తున్నట్లు వార్తలు రావడంతో పట్టణంలోని పెట్రోల్ బంకుల వద్ద వాహనదారులు తమ వాహనాలలో పెట్రోల్, డీజిల్ కొట్టించడానికి బారులు తీరారు. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు కూడా వాహనదారులతో పెట్రోల్ బంకులన్నీ కిక్కిరిసిపోయాయి.

బచ్చురాజు పల్లిలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర

నవతెలంగాణ-నిజాంపేట



వికసిత్ భారత్ సంకల్పయాత్ర మండల పరిధిలోని బచ్చు రాజు పల్లి గ్రామంలో మంగళవారం నోడల్ అధికారి మురళీకృష్ణ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. స్పెషల్ ఆఫీసర్ గోవిందు, నోడల్ అధికారి మురళీకృష్ణలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని, బ్యాంకుల ద్వారా సబ్సిడీల రూపంలో అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తుందన్నారు. మహిళలకు కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేసుకోవడానికి ఆర్థిక సహాయం అందజేస్తుందన్నారు. కుల వృత్తుల వారికి పనిముట్లను సబ్సిడీ ధరలకే అందిస్తుందన్నారు. వ్యవసాయదారులకు విత్తనాలను, ఎరువులను సబ్సిడీలకు అందిస్తుందన్నారు. దీపం పథకం ద్వారా నిరుపేదలకు గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేసిందన్నారు. గ్రామాలలో డంపింగ్ యార్డులు, వైకుంఠధామాలు, పల్లె ప్రకృతి వనాలు, హరితహారం మొక్కలు, మరుగుదొడ్లు నిర్మించడంలాంటి పథకాలలో కేంద్ర ప్రభుత్వం నిధులు ఉన్నాయన్నారు. ఉపాధి హామీ పథకంలో రోడ్లు వేసుకోవడం, ధాన్యం ఆరబెట్టుకోవడానికి కల్లాలను, ఏర్పాటు చేసుకోవడానికి నిధులను మంజూరు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జగదీశ్వర్ చారి, ఎంపిఓ రాజేందర్, అగ్రికల్చర్ అధికారి సతీష్, ఏఈఓ కావేరి, గ్రామపంచాయతీ కార్యదర్శి యాదలక్ష్మి, జిల్లా కోఆర్డినేటర్ సిహెచ్. శ్రీనివాస్, మండల కోఆర్డినేటర్ చంద్రశేఖర్ . రామాయంపేట ఉమ్మడి మండలాల సీనియర్ నాయకులు తీగల శ్రీనివాస్ గౌడ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ/తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)



ప్రభుత్వం నుంచి వచ్చే సంస్రమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సర్పంచ్ రేణుకా అంజనేయులు పేర్కొన్నారు. మంగళవారం వెంకటాపూర్ అగ్రహారం గ్రామంలో జరిగిన అభయ హస్తం కార్యక్రమంలో బాగంగా చేపట్టిన ఆరు గ్యారెంటీల పథకాలలో బాగంగా గ్రామంలో గ్రామ సభను నిరఙహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ద్వార ఇస్తున్న ఆరుగ్యారెంటీలలో బాగంగా ఇస్తున్న సంక్షేమ పథకాలను గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ప్రజలు ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలతో అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ యంజాల విఠల్‌రెడ్డి, ఎంపీడీవో యాదగిరిరెడ్డి, ఉపసర్పంచ్ ఆంజనేయులు, ఇరిగేషన్ ఏఈ అనురాధ, మిషన్ భగీరథ ఏఈ దివ్య, విద్యుత్ శాఖ ఏఈలతో పాటు అధికారులు ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా ప్రతాపరెడ్డి జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-మద్దూరు



కాంగ్రెస్ పార్టీ జన గామ జిల్లా డీసీసీ అధ్యక్షు లు మాజీ ఎమ్మెల్యే కొమ్మూ రి ప్రతాపరెడ్డి జన్మదిన వేడుకలను మద్దూరు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో జడ్పీటిసి గిరి కొండల్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కేక్ కట్ చేసి విద్యార్థులకు స్వీట్లు, అరటి పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొమ్మూరి ప్రతాపరెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఈ ప్రాంత అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. అదేవిధంగా మద్దూరు, దూళ్మిట మండల కేంద్రాలలో మండల అధ్యక్షులు బండి శ్రీనివాస్ గౌడ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చెట్కూరి కమలాకర్ యాదవ్, కామిడీ జీవన్ రెడ్డిల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. బెక్కల్ సర్పంచ్ కూకట్ల బాలరాజు యాదవ్, ఎంపీటీసీ ఇర్రి రాజేశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచ్ మేక మల్లేశం, రామడుగు బాలరాజు, మండల నాయకులు ఊట్ల శ్రీధర్ రెడ్డి, ఇర్రి రమణారెడ్డి, దాసరి పద్మా రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు ఎఫ్ఎం షౌకత్ అలీ, కనక చంద్రం, పుల్లూరి రాజు పాల్గొన్నారు.


ఇంటింటికి అయోధ్య శ్రీరాముని అక్షింతలు

నవతెలంగాణ-మర్కుక్



మండల కేంద్రంతో పాటు గంగాపూర్ యూసుఫ్ ఖాన్‌పల్లి, చేబర్తి, పాములపర్తి, దామరకుంట తదితర గ్రామాలలో అయోధ్య శ్రీరాముని అక్షింతలను సీతా రామాంజనేయ భక్తులు సోమవారం ఇంటింటికి పంపిణీ చేశారు. ఆయా గ్రామాలలో హనుమాన్ మందిర్ నుంచి పురవీధుల గుండా శోభయాత్ర నిర్వహించారు. ప్రతి ఇంటికి అక్షింతలతో పాటు అయోధ్య రామాలయం ఫోటో, కరపత్రం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలలో ఇంటింటికి అయోధ్య రాముని అక్షింతలను పంపిణీ చేయడం జరుగుతుందని, ఈనెల 22వ తేదీన అయోధ్యలో శ్రీరాముని ప్రాణ ప్రతిష్ట సందర్భంగా ప్రతి ఒక్కరు ఆ కార్యక్రమాన్ని వీక్షించడంతో పాటు రాత్రి సమయంలో ప్రతి ఇంటి వద్ద 5 దీపాలను వెలిగించాలని సూచించారు. 500 సంవత్సరాల భారతీయుల కళ రామమందిరం నిర్మాణం పూర్తవడంతో పాటు జనవరి 22న రాముని ప్రతిష్ట మహోత్సవం అయోధ్యలో జరుగుతుందని వివరించారు. శ్రీరామచంద్రుడు ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయుడని ఆయన చూపిన బాటలో ప్రతి ఒక్కరు పయనించాలని పేర్కొన్నారు. రమేశ్ గుప్తా, బాలరాజు,జగదీష్ సింగ్, శ్రీను, రాంరెడ్డి, అంజిరెడ్డి,ఏగొండ,పాండు సింగ్,కృష్ణ,రామ్ సింగ్, శంకర్ సింగ్, అనంతరాంసింగ్, రమేష్, రాము, పరశురాములు పాల్గొన్నారు.

నవతెలంగాణ-నిజాంపేట



శ్రీరామ అయోధ్య జన్మభూమి తీర్థయాత్ర సందర్భంగా నిజాంపేట మండల కేంద్రంలో మంగళవారం అయ్యప్ప స్వాముల ఆధ్వర్యంలో అక్షింతలతో ఊరేగింపు శోభయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అయోధ్యలో శ్రీరామ మందిరం జనవరి 22న ప్రారంభం సందర్భంగా గ్రామ గ్రామానికి అక్షింతలు తీసుకొచ్చి శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జి.పి స్వామి, జాల పోచయ్య, శెనగపల్లి తిరుపతి, వెల్దుర్తి వెంకటేష్, గౌడ్, జాల శ్రీకాంత్, రంజిత్ గౌడ్, వీరమల్లు బాలకృష్ణ, పంజా బాబు, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-గజ్వేల్



గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్ గ్రామంలో రామాలయం ముందు మంగళవారం అయోధ్య రామ అక్షంతల రావడంతో గ్రామ పెద్దలు ఘనంగా స్వాగతం పలికారు. రామ అక్షంతల కలశాలకు పురోహితుడు బెజగామా విట్టల శర్మ హాజరై పలువురు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బండారు రామ్మోహన్‌రావు, సుజాత, బండారు రామ్ ఫణిందర్‌రావు, సంధ్యారాణి దంపతులు పాల్గొన్నారు.

ప్రజాపాలనకు విశేష స్పందన

నవతెలంగాణ-నిజాంపేట



ప్రజా పాలనకు విశేష స్పందన లభిస్తుందని స్పెషల్ అధికారి గోవిందు, మండల తహసీల్దార్ సురేష్ కుమార్‌లు అన్నారు మండల పరిధిలోని కె. వెంకటాపూర్, రజాక్ పల్లి గ్రామాలలో ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు పథకాలను ప్రజలకు వివరించారు. ప్రజాపాలనకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. దరఖాస్తు ఫారాలను 6 తేదీ వరకు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అనిల్ కుమార్, ఆర్ఐ గంగాధర్ గౌడ్, మిషన్ భగీరథ ఏఈ బిక్షపతి, విద్యుత్ ఏఈ గణేష్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దయాకర్, గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షులు అక్కల దుబ్బరాజు, సిద్ధ రాములు, ముత్యాల మధుసూదన్ రెడ్డి, జనగామ రాజేందర్, మహిపాల్, భాస్కర్ గౌడ్, కాస రాజేశం, పెంటయ్య, వెలుగు స్వరూప తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లయన్ సత్యనారాయణ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ మాజీ అధ్యక్షులు టీచర్, యుటిఎఫ్ నాయకులు సత్యనారాయణ జన్మదినం సందర్భంగా లక్ష్మి ప్రసన్న నగర్‌లో సత్యనారాయణ స్వగృహంలో నిర్వహించారు. జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజమౌళితో కలిసి మాజీ ఎఫ్డీసీ చైర్మన్ ప్రతాపరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ టీచర్ వృత్తిలో మంచి గుర్తింపు తెచ్చుకున్న సత్యనారాయణకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ భాగ్యలక్ష్మి దుర్గాప్రసాద్, గోపాల్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ గజ్వేల్ పట్టణ అధ్యక్షులు నవాజ్, లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ గుడాల రాధాకృష్ణ,లయన్ పరమేశ్వర చారి , లయన్ రామ్ ఫనిదర్, లయన్ గోలి సంతోష్, లయన్ విజయ్ భాస్కర్, లయన్ ఎల్లం రాజు, మరుమాముల ఓంకార్ పాల్గొన్నారు.

విరహత్‌ను సన్మానించిన ఉపాధ్యాయ సంఘాలు



నవతెలంగాణ- గజ్వేల్

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన విరహత్‌ను ఉపాధ్యాయ సంఘాలు ఘనంగా సన్మానించాయి. మంగళవారం టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్, మర్కుక్, ములుగు మండలాల అధ్యక్షులు విద్యాధర రెడ్డి, యూసుఫ్ అభినందనలు తెలిపారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభమైన మీడియా రంగంలో గత 30 ఏళ్లగా పాత్రికేయుల హక్కుల కోసం కాకుండా ప్రజా సమస్యలపై పోరాటం చేసిన విరహత్ అలీకి ఈ పదవి దక్కడం ఎంతో సంతోషమన్నారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆశిస్తున్నామన్నారు.

మార్కెట్ ఉన్నా బయటనే విక్రయం

- అన్ని శాఖలు కలిసిరాని వైనం
- రూ. కోట్లు వెచ్చించి నిర్మించినా వృధాగా సమీకృత మార్కెట్





నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్లో కోట్లాది రూపాయలు వెచ్చించి సమీకృత మార్కెట్ ఏర్పాటు చేసినా ఫలితం లేకుండాపోయిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం కూరగాయల వ్యాపారులు తిరిగి రోడ్డుపైనే విక్రయాలు సాగిస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవడంతో పాటు మార్కెట్లోని వ్యర్థాలతో ప్రజారోగ్యానికి ముప్పు వాటిల్లే అవకాశాలున్నాయని ఆరోగ్యనిపుణులు చెబుతున్నారు. రోడ్డుపై కూరగాయలు ఏర్పాటు చేయడం వల్ల వాటి ని తొలగించేందుకు మున్సిపల్ శాఖ, పోలీస్ శాఖ సహకరించాల్సిన అవసరం ఉంది. పోలీసులు, మున్సిపల్ అధికారులు పట్టించుకోవటం లేదనే విమర్శలు మార్కెట్ అధికారుల నుంచి వినిపిస్తున్నాయి. అన్ని శాఖలు సమనీయంతో పనిచేస్తేనే ట్రాఫిక్ సమస్య తీరుతుందని ప్రజలు భావిస్తున్నారు.

వివరాల్లోకి వెళ్తే.. గతంలో పట్టణంలో రోడ్ల పైనే కూరగాయలు, ఇతర తినుబండారాలు విక్రయించే వారు. కానీ అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం కావడంతో అధికారులు, ప్రజా ప్రతినిధులతో పాటు రోడ్లపై ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు రోడ్లపై కూరగాయల స్టాండ్‌ను పెట్టనీయలేదు. ఇందుకోసం ప్రత్యామ్నాయంగా పూలు, పండ్లు, కూరగాయలు, మాంసం, అన్ని ఒకే చోట దొరికేలా రూ.30కోట్ల వ్యయంతో పట్టణ నడిబొడ్డున సమీకృత మార్కెట్‌ను నిర్మించారు. సమీకృత మార్కెట్లో స్టాళ్లను ఏర్పాటు చేయించారు. అవసరమైన వారికి స్టాళ్లను కేటాయించారు. సమీకృత మార్కెట్‌కు వెళ్తే వాహనం నిలిపి అక్కడి నుంచి నడుస్తూ వెళ్లి కూరగాయలు తీసుకొని వెళ్లడం ప్రజలకు ఇబ్బందిగా మారింది. దీంతో వ్యాపారాలు తగ్గిపోతున్నాయని, తాము బతికేదేలా అంటూ చిరు వ్యాపారులు గత కొన్నాళ్లుగా మొరపెట్టుకున్నారు. ఈ విషయంపై ప్రజలకు, వ్యాపారులకు అవగాహన కల్పించాల్సిన అధికారులు పట్టింపు లేనట్లుగా వ్యవహరించడంతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. ఇటీవల ప్రభుత్వం మారడం, అధికారులు పట్టించుకోకపోవడం తదితర కారణాలతో చిరువ్యాపారులు తిరిగి రోడ్డుపైనే దుకాణాలు పెడుతూ విక్రయాలు చేస్తున్నారు. ప్రస్తుతం యథేచ్ఛగా రోడ్డుపై వ్యాపారాలు చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. దీంతో ప్రజలు, వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన సమీకృత మార్కెట్ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

అందరూ సహకరించాలి

గజ్వేల్ పట్టణంలో ఏర్పాటు చేసిన వేజ్, నాన్ వెజ్ మార్కెట్‌లో కాకుండా రోడ్డుపై చేయడం వల్ల ఇబ్బందులు వస్తున్నాయి. అన్ని శాఖల అధికారులు సహకరిస్తే సాధ్యమవుతుంది. ముఖ్యంగా మున్సిపల్, పోలీస్ శాఖ అధికారులు తమతో సహకరించాలని ఇప్పటికే కోరాము. అయినా సాధ్యమైన మేరకు ప్రయత్నం చేస్తున్నాం. మిగతా శాఖలు కూడా సహకరిస్తే పూర్తిస్థాయిలో మార్కెట్లోనే విక్రయాలు జరుగుతాయి.

- గజ్వేల్ మార్కెట్ కార్యదర్శి జాన్ వెస్లీ

20 వసంతాలను పూర్తి చేసుకున్న హరేరామ భజన బృందం





నవతెలంగాణ-గజ్వేల్

రామ నామమే శాశ్వతమని నమ్మిన హరేరామ హరేకృష్ణ భజన బృందం నేటికి 20 వసంతాలను పూర్తి చేసుకున్నది. ఈ శుభ సందర్భంగా శ్రీరామకోటి భక్త సమాజం ఆధ్వర్యంలో అద్దాల మందిరం వద్ద సీతారాములకు సంస్థ అధ్యక్షులు రామకోటి రామరాజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామకోటి రామరాజు మాట్లాడుతూ ఎండనక, వాననక, చలిని కూడా లెక్క చేయకుండా రామాలయంకు ఉదయం 4 గంటల వరకు చేరుకొని హరేరామ నామ సంకీర్తనను ప్రారంభించి సూర్యోదయం లోపే 6 గంటలకు హారతి ఇచ్చేవాడినని తెలిపారు. మనకు చివరి వరకు తోడు వచ్చేది, వెంట ఉండి నడిపించేది రామ నామమేనన్నారు. ప్రతి రోజు రామ నామాన్ని స్మరించాలి, లిఖించి తరించాలన్నారు.

కోదండరాంను కలిసిన నేతలు



నవతెలంగాణ-గజ్వేల్

తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాంను మంగళవారం గజ్వేల్ నేతలు కలిసి సత్కరించారు. హైదరాబాదులోని పార్టీ కార్యాలయంలో టీజేఏసీ జిల్లా చైర్మన్, న్యాయవాది బాపురావు, తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు నీరుడు స్వామి, జిల్లా కో కన్వీనర్ అందె ప్రవీణ్, సీనియర్ జర్నలిస్టు కిరణ్ కుమార్‌లు కోదండరావమ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లాలో ఉన్న రాజకీయ పరిస్థితులపై చర్చించారు. తదనంతరం గత ఎన్నికల ముందు గ్రామాలలో ముస్కూరిగా పనిచేస్తున్న వారి కుటుంబాల పొట్టగొట్టి, ఓట బంది విధానం రద్దు చేస్తూ, గత ప్రభుత్వం తీసుకున్న అక్రమ జీవోలను హైకోర్టు తప్పు పట్టినా గానీ ఇస్నాదారులను కాదని ఒకరిని నియమించడం మూలాన మిగతా ఇస్నాదారులైన రాష్ట్రంలోని 4 లక్షల కుటుంబాలకు అన్యాయం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఇస్నా దారులందరికి న్యాయం చేయించాలని ఈ సందర్భంగా కోదండరామ్‌ను కోరారు. ఈ సమస్యపై పాత వోటాబందు పద్ధతి కొనసాగేలా అందరికీ న్యాయం జరిగేలా చూస్తానని కోదండరాం తెలిపారు.


ఆరు గ్యారంటీల కోసం దరఖాస్తుల స్వీకరణ



నవతెలంగాణ-నంగునూరు

ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా నాలుగో రోజైనా మంగళవారం మండలంలోని అంక్షాపూర్, మైసంపల్లి, సిద్దన్నపేట, బద్దిపడగ గ్రామాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీల పథకాల అమలు కోసం దరఖాస్తులను స్వీకరించారు. ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు అధ్యక్షత వహించారు. అంక్షాపూర్, మైసంపలిలో మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి, బద్దిపడగలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తప్పెట శంకర్ హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమాల్లో నంగునూరు మండల స్పెషలాఫీసర్ కె.రాంగోపాల్ రెడ్డి, ఎంపీడీవో వేణుగోపాల్, తహశీల్దార్ అనిల్ కుమార్, వివిధ గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

కొండెక్కిన కోడిగుడ్డు



నవతెలంగాణ-నంగునూరు

నిత్యావసరాల ధరలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. ఒకదాని రేట్లు తగ్గుతున్న సమయానికి మరో దాని రేట్లు పెరిగుతున్నాయి. మొన్నటివరకు ఉల్లిగడ్డలు, టమాటల ధరలు కొండెక్కగా, ఆ తర్వాత చికెన్ రేట్లు అనంతరం వెల్లుల్లి ఇలా ఒక్కొక్కటిగా మండిపోతూ సామాన్యుని జేబుకు చిల్లు పెడుతున్నాయి. ఇక ఇప్పుడు కోడిగుడ్ల వంతు వచ్చింది. షాపుల్లో కోడిగుడ్ల ధరలు కొండెక్కి కూర్చున్నాయి. కార్తీకమాసం ముగిసిన తర్వాత గుడ్ల వినియోగం విపరీతంగా పెరగటంతో ధర కూడా అదే స్థాయిలో పెరుగుతుంది. గత నెలలో ఒక్కో గుడ్డు ధర కేవలం రూ.5.50 మాత్రమే ఉండగా వారం రోజుల క్రితం రూ.6కు చేరుకుంది. కాగా.. ఇప్పుడు ఏకంగా రూ.7 నుంచి రూ.8గా పలుకుతోంది. వారం రోజుల్లోనే డజను గుడ్ల ధర ఏకంగా రూ.72 నుంచి రూ.84కు చేరుకోవటం జరిగిందని విక్రయదారులు చెబుతున్నారు. హెూల్‌సేల్‌లో ఒక్కో గుడ్డు ధర రూ.5.76 ఉండగా రిటైల్‌లో రూ.7గా అమ్ముతున్నారు. కొన్ని కొన్ని దుకాణాల్లో రూ.7.50, రూ.8గా కూడా అమ్ముతుండటం గమనార్హం. ప్రస్తుతం కేసు ధర రూ.180 నుంచి రూ.200 చేరడంతో రిటైల్ మార్కెట్‌లో రూ.7 నుంచి రూ.8 వరకు అమ్ముతున్నారు. మరోవైపు చికెన్ ధరలు కూడా పెరుగుతున్నాయి. కార్తీక మాసంలో కిలో చికెన్ రూ.170 నుంచి రూ.190 వరకు పెరుగుతున్నా అమ్మకాలు తగ్గడం లేదు. తాజాగా రూ.240కి చేరటం గమనార్హం.

సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన బండారు



నవతెలంగాణ-గజ్వేల్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని గజ్వేల్ నియోజకవర్గానికి చెందిన సీనియర్ నాయకులు, టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీ కాంతారావు మంగళవారం కలిసి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం అన్ని విధాలుగా గజ్వేల్ నియోజకవర్గం అభివృద్ధి కోసం కృషి చేయాలని ఆయన సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు.

దరఖాస్తుదారులందరు రశీదు తీసుకోవాలి



నవతెలంగాణ-బెజ్జంకి

ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తులు సమర్పించిన కుటుంబాలు ఖచ్చితంగా రశీదు నెంబర్ తీసుకోవాలని ఎంపీడీఓ దమ్మని రాము సూచించారు. మంగళవారం మండల పరిధిలోని గాగిల్లపూర్, నర్సింహులపల్లి గ్రామాల్లో ప్రత్యేకాధికారి రాఘవ రెడ్డి, ఎంపీడీఓ రాము ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రారంభించారు. గాగిల్లపూర్ గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజలు దరఖాస్తుల కోసం గందరగోళం సృష్టించారు. ప్రజాపాలనలో ఇబ్బందులు తలెత్తకుండా సజావుగా సాగేలా పోలీసులు భాగస్వామ్యమవడంలో అలసత్వం వహించడం పట్ల ఎంపీడీఓ రాము అగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీఓ రాము దరఖాస్తులను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. సర్పంచ్ అన్నాడీ సత్యనారాయణ, ఎంపీటీసీ కొమిరే మల్లేశం, ఉపసర్పంచ్ బామండ్ల తిరుమల, వార్డ్ సభ్యులు, ఏఓ సంతోష్ కుమార్, పంచాయతీ కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్, ఫీల్డ్ అసిస్టెంట్ రాములు, గ్రామస్తులు హజరయ్యారు.

మైనింగ్ ఏడీకీ పాలకవర్గం సభ్యుల వినతి

గ్రామ శివారులోని మోయతుమ్మెద వాగు నుంచి అక్రమంగా సాగుతున్న ఇసుక దోపిడిని అరికట్టాలని మైనింగ్ శాఖ ఏడీ, ప్రత్యేకాధికారి రాఘవ రెడ్డికి పంచాయతీ పాలకవర్గం ప్రజాపాలనలో వినతిపత్రం అందజేశారు. మండలంలోని అధికారులు విధుల్లో అలసత్వం వహించడం వల్లే ప్రకృతి ప్రసాదించిన ఇసుక సంపదను అక్రమ రవాణదారులు రాత్రింబవళ్లు కొల్లగొడుతున్నారన్నారు. ఇప్పటికైనా ఇసుక రవాణను అరికట్టాలని, లేనిపక్షంలో అధికారుల తీరుపై నిరసనలు చేపడుతామని పంచాయతీ పాలకవర్గం సభ్యులు హెచ్చరించారు.

పద్మశాలి క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-దుబ్బాక

జిల్లా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన క్యాలెండర్‌లను దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఆవిష్కరించారు. దుబ్బాక పురపాలిక కేంద్రంలోని పద్మశాలి భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డికి పద్మశాలి సమాజం అధ్యక్షుడు గాజుల తిరుపతి శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఆస యాదగిరి, పద్మశాలి సమాజం కార్యవర్గ సభ్యులు, పాండి పెద్దలు, యువజన సంఘం సభ్యులు, నాయకులు వడ్లకొండ శ్రీధర్, శ్రీరామ్ నరేందర్, గోనె మధుసూదన్, మంతూరి చంద్రశేఖర్, బీఆర్ఎస్ నాయకులు గన్నె భూమిరెడ్డి, రాజమౌళి, కిషన్ రెడ్డి, ఎల్లారెడ్డి, పలువురు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ ఆధ్వర్యంలో మాస్కుల పంపిణీ



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ ప్రభుత్వ దవాఖాన వద్ద మంగళవారం లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ అధ్యక్షులు నేతి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మాస్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నేతి శ్రీనివాస్ మాట్లాడుతూ మళ్ళీ కరోనా వ్యాప్తి చెందుతున్నట్లు వార్తలు వస్తున్నాయని ప్రతి ఒక్కరూ స్వీయ నియంత్రణ పాటంచాలన్నారు. మాస్కులు ధరించి కరోనా నియమాలు పాటించాలని వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ ఆధ్వర్యంలో సభ్యుల సహకారంతో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, మానవసేవే మాధవసేవా అని ప్రతి ఒక్కరూ సేవా నిరతి కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కొండపోచమ్మ దేవస్థానం మాజీ డైరెక్టర్ గోలి సంతోష్, ఎన్విరాన్‌మెంట్ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు లయన్ పరమేశ్వర చారి, లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ గుడాల రాధాకృష్ణ, లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ ట్రెజరర్ లయన్ నాగేంద్రం, లయన్ ఎల్లం రాజు, లయన్ గుడాల నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతలకు ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-బెజ్జంకి

అయోధ్యలో శ్రీరామ ఆలయ నిర్మాణం సందర్భంగా మండల పరిధిలోని దాచారం గ్రామానికి చేరుకున్న అక్షింతలకు మంగళవారం రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయోధ్య అక్షింతలను గ్రామంలోని ఇంటింటికి అందిచేలా కార్యాచరణ రూపొందిస్తామని బీజేపీ మండలాధ్యక్షులు కొలిపాక రాజు తెలిపారు. బీజేపీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శాసనమండలి డిప్యూటీ చైర్మన్‌ను కలిసిన యాదగిరి



నవతెలంగాణ-గజ్వేల్

శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్‌ను మంగళవారం నాచారం టెంపుల్ మాజీ చైర్మన్ కొట్టాల యాదగిరి కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శాసన మండలి డిప్యూటీ చైర్మన్ ప్రకాష్ మాట్లా డుతూ విజయం సాధించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన కోరారు. తెలంగాణలో 17 పార్లమెంట్ స్థానాలు విజయానికి క్షేత్రస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు కష్టపడి పనిచేయాలని ఆయన కోరారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృతంలో పార్లమెంటు ఎన్నికల్లో ఘన విజయం సాధిస్తామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

నవతెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరించిన ఏసీపీ



నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్

ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు నిదర్శనం గజ్వేల్ ఏసీపీ ఎం.రమేష్ అని గజ్వేల్ నవతెలంగాణ పీసీ ఇంచార్జ్, గజ్వేల్ రూరల్ విలేకరులు నాయిని పెద్ద యాదగిరి, రమేష్ చెక్కల అన్నారు. మంగళవారం గజ్వేల్ ఏసిపి ఎం.రమేష్ జన్మదినం సందర్భంగా శాలువాతో సన్మానించి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఏసీపీ చేతుల మీదుగా నవతెలంగాణ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల సమస్యలపై అనునిత్యం శ్రమిస్తూ గజ్వేల్ నియోజకవర్గంలో మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించారన్నారు. ప్రజలతో పోలీసులు స్నేహభావంగా ఉంటూ వారి సమస్యలు పరిష్కరించే దిశగా ముందుకు కొనసాగుతున్నారన్నారు. గతంలో పోలీసులు అంటే భయపడే జనం ప్రస్తుతం అన్న తమ్ముళ్ల మాదిరిగా కలిసిమెలిసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు. గజ్వేల్ ఏసిపి రమేష్ వృత్తిరీత్యా తన బాధ్యతను నిర్వర్తిస్తూనే, సామాజిక సేవలో తనకంటూ ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకున్నారన్నారు. అనంతరం ఏసీపీ ఎం రమేష్ మాట్లాడుతూ నిజాన్ని నిర్భయంగా ప్రజలకు తెలియజేస్తూ సమస్యల పరిష్కారానికి పత్రిక రంగం ఎంతో తోడ్పడుతుందన్నారు. ఎలాంటి సమస్యనైనా వెలికి తీయడంలో పత్రిక విలేకరులు ఎంతో చురుగ్గా పనిచేస్తున్నారు. సమస్య గుర్తించి, ఆ సమస్య పరిష్కరించడంలో వారి పాత్ర మరువలేనిదన్నారు. ఈ సందర్భంగా గజ్వేల్ నియోజకవర్గం ప్రజలందరికీ, పత్రిక యజమాన్యాలకి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏడివిటీ ఇంచార్జ్ చెరుకు నరసింహ రెడ్డి, సర్కులేషన్ ఇంచార్జ్ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఏసీపీ రమేష్‌ను కలిసిన సామాజిక కార్యకర్త



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ ఏసిపి కార్యాలయంలో మంగళవారం మర్కుక్ మండల ఆర్‌టీఐ హ్యూమన్ రైట్స్ అడ్వకేట్ సెక్రటరీ తాండా బాలకృష్ణ గౌడ్ ఏసిపి రమేష్ గౌడ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ గౌడ్ మాట్లాడుతూ ఏసిపి రమేష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఏసీపీ రమేష్ గౌడ్ ప్రజలకు అందుబాటులో ఉంటూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారని, భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాక్షించారు.

ప్రభుత్వాలు మారిన పేదల బతుకుమారేది ఎన్నడు

డిబిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు.



నవతెలంగాణ- రాయపోల్

ప్రభుత్వాలు మారిన పాలకులు మారిన పేదల బతుకుదెరువు మాత్రం మారడం లేదని ఎన్నో సమస్యలు కష్టాలతో సతమతమవుతున్నారని డిబిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు అన్నారు. మంగళవారం రాయపోల్ మండలం ఆరేపల్లి గ్రామనికి చెందిన కుమ్మరి నరసమ్మ కుటుంబాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా బ్యాగరి వేణు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారిన పేదల బతుకులు మారడం లేదన్నారు. ఆరేపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి నరసమ్మ- రాజయ్య దంపతుల ఇల్లు వానలకు కూలిపోయి భయభ్రాంతులతో బతుకుతున్న పరిస్థితుల్లో జీవిస్తున్నారన్నారు.


ప్రజా పాలనను ఆకస్మిక తనిఖీ చేసిన ఆర్డీవో



నవతెలంగాణ-నంగునూరు

ప్రశాంత వాతావరణంలో దరఖాస్తుల స్వీకరణ కొనసాగించాలని ఆర్డీవో రమేష్ బాబు సూచించారు. మండల పరిధిలోని సిద్దన్నపేట గ్రామంలో నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని ఆర్డీవో రమేష్ బాబు ఆకస్మికంగా సందర్శించారు. లబ్దిదారులు నమోదు చేసుకుంటున్న దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. లబ్దిదారులు ఎవరూ తొందరపడొద్దని, సాయంత్రం ఆరు గంటల వరకు దరఖాస్తులు తీసుకుంటారని పేర్కొన్నారు. తదుపరి ఎవరైనా దరఖాస్తు చేసుకోవాలనుకునేవారు ఆరు వరకు గ్రామ పంచాయతీ కార్యదర్శికి అందిచ్చవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ అనిల్ కుమార్, సర్పంచ్, ఎంపీటీసీ, రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి, ఏఎన్ఎం, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు పలువురు పాల్గొన్నారు.

4న మాటామంతి మోహనరాగం వెయ్యి ఎపిసోడ్ వేడుక



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ఎస్ఎల్ఎస్ కన్వెన్షన్ హాల్లో ఈ నెల 4వ తేదిన మాటామంతి-మోహనరాగం కార్యక్రమం చేపట్టి 1000 ఎపిసోడ్ వరకు వచ్చిందని లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ఉభయ తెలుగు రాష్ట్రాల సమన్వయ కర్త బహుముఖ ప్రజ్ఞాశాలి బండారు రామ్మోహన్‌రావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు ఉదయం నుంచి తొమ్మిది గంటల వరకు ఫేస్బుక్ యూట్యూబ్ లైవ్‌లో ఈ కార్యక్రమం ప్రసారమవుతుందన్నారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, చారిత్రక తదితర అంశాలపై ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. 2024 జనవరి 4 వరకు 1000 ఎపిసోడ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గజ్వేల్‌లో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి లోక్సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ, సీబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ జేడీ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొంటారని ఆయన తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-కొండపాక

ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపిటిసిలఫోరం స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్ తెలిపారు. అభయ హస్తం కార్యక్రమం కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లి, వెలికట్ట, సిరసనగండ్ల, కుకునూరుపల్లి మండలం లకుడారం, మాత్‌పల్లి గ్రామాల్లో దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తిమ్మారెడ్డిపల్లి, లకుడారం గ్రామాల్లో ఆయన మాట్లాడారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని అలాగే ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమాల్లో స్పెషల్ ఆఫీసర్లు అమీనా బేగం, నాగేందర్ తహసీల్దార్‌లు మల్లికార్జున్, శ్రీనివాస్, ఎంపీడీవో రాంరెడ్డి, పలు గ్రామాల సర్పంచులు కందూరి కనకవ్వ ఐలయ్య, లక్ష్మారెడ్డి, రవీందర్, మహిపాల్, కాంగ్రెస్ నాయకులు అండాలమ్మ, కుమ్మరి బాలేష్, ఎండి అష్రఫ్ పలువురు అధికారులు పాల్గొన్నారు.

అసంఘటిత రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయు సిద్దిపేట జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్ డిమాండ్

నవతెలంగాణ-మద్దూరు

రాష్ట్రంలో నూతనంగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం అసంఘటితరంగా కార్మికులకు సమగ్ర చట్టం చేసి సమస్యలు పరిష్కరించి వారిని ఆదుకోవాలని సీఐటియు సిద్దిపేట జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం సీఐటియు దూల్మిట్ట మండల విస్తృత సమావేశం మండల కో కన్వీనర్ సుద్దాల భాస్కర్ అధ్యక్షతన నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చొప్పరి రవికుమార్ హాజరై మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికులకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక వాగ్దానాలు చేసి వాటిని విస్మరించిందన్నారు. ఈ తరుణంలోనే కార్మికుల ఆగ్రహానికి గురై ఇంటి బాట పట్టిందని దాని స్థానంలో నూతనంగా ఎన్నిక కాబడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల పక్షపాతిగా ఉండాలన్నారు. వారి సంక్షేమం కోసం సమగ్ర చట్టం తీసుకువచ్చి



అసంఘటిత రంగ కార్మికుల్ని ఆదుకోవాలని ఈ సందర్భంగా వారు కోరారు. భవన నిర్మాణ కార్మికుల మాదిరిగానే హమాలిరంగ కార్మికులకు, రవాణా రంగ కార్మికులకి వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. వాటి ద్వారా సంక్షేమ ఫలాలు అందే విధంగా చూడాలన్నారు. హమాలీ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, ఇల్లు లేని వారికి గృహలక్ష్మి పథకం కింద ఇల్లును మంజూరు చేసి ఇవ్వాలని వారు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం 6 గ్యారంటీల్లో లబ్దిదారులు కార్మికుల ముందు వరుసలో ఉంచాలన్నారు. 55 సంవత్సరాల నిండిన వారికి రూ.5000ల పెన్షన్ ఇవ్వాలని, రవాణా రంగ కార్మికులకు ఉచిత బస్సు సౌకర్యం నేపథ్యంలో రోడ్డున పడుతున్న వారిని ఆదుకోవాలని వారికి ప్రత్యామ్నాయ మార్గాలు చూపించాలన్నారు అర్హులైన డ్రైవర్లను కొత్తగా తీసుకు వస్తున్న బస్సులకు ఆర్టీసీ డ్రైవర్లుగా తీసుకోవాలని, మూడు నెలల పాటు రోడ్ టాక్స్, ఇఎంఐలు, తదితర అంశాలు వెసులుబాటు కల్పించాలని కోరారు. ఈ సమస్యలు పరిష్కరించి కార్మికులను ఆదుకోవాలన్నారు. లేనిపక్షంలో రానున్న కాలంలో కార్మిక వర్గాల ఐక్యం చేసి పోరాటాలు చేస్తామన్నారు. అనంతరం సీఐటియు మండల కమిటీని ఎన్నుకున్నారు. సీఐటీయు మండల కన్వినర్‌గా పోతిరెడ్డి రాజు, కోకన్వినర్ సుద్దల భాస్కర్ కమిటీ సభ్యులుగా డి. మల్లయ్య, సిద్దులు, సత్యనారాయణ, ప్రసాద్, గటయ్య, వీరయ్య, కనకయ్య, మొగిలి, రాజు, చందర్, కనకస్వామి, కనకచారి,యాదయ్య, బాలనర్సయ్య, సంపత్, రాజు, రాజన్న, ప్రభాకర్‌లను ఎన్నుకున్నారు.

సీఎం రేవంత్ రెడ్డికి మల్లన్న కళ్యాణ ఆహ్వాన పత్రిక



నవ తెలంగాణ-కొమురవెల్లి

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కొమురవెల్లి మల్లన్న కళ్యాణ ఆహ్వాన పత్రికను మంగళవారం ఆలయ ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్ ఆధ్వర్యంలో రాష్ట్ర సచివాలయంలో అందజేశారు. జనవరి 7న నిర్వహించే కొమురవెల్లి మల్లికార్జున స్వామి కళ్యాణానికి సీఎంను ఆహ్వానించినట్టు ప్రధాన అర్చకులు మల్లికార్జున్ తెలిపారు. ఈ సందర్భంగా మల్లన్న ప్రసాదంతో పాటు, స్వామి వారి చిత్రపటాన్ని ముఖ్యమంత్రికి అందజేశామన్నారు.

కరెంట్ షాక్‌కు గురై పాడి గేదె మృతి



నవతెలంగాణ-నంగునూరు

మండల పరిధిలోని ఖానాపూర్ గ్రామానికి చెందిన రైతు అక్కెనపల్లి కృష్ణారెడ్డి సంబంధించిన గౌడి బర్రె కరెంటుషాక్‌కు గురై చనిపోయింది. మంగళవారం ఉదయం 10గంటల సమయంలో తన వ్యవసాయ పొలంలో కరెంటుషాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందిందని కృష్ణారెడ్డి తెలిపారు. లక్ష రూపాయల విలువచేసే గౌడిబర్రె రోజుకు 15లీటర్లకు పైబడి పాలు ఇచ్చేదని బాధితుడు ఆవేదన వ్యక్తంచేశారు. తనకు జరిగిన నష్టానికి సహాయం అంద జేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

ప్రజాపక్షమే నవతెలంగాణ లక్ష్యం



మాజీ మంత్రి హరీశ్‌రావు

నవతెలంగాణ-సిద్దిపేట

నవతెలంగాణ దినపత్రిక లక్ష్యం ప్రజాపక్షమని, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పత్రికలు ఉండాలని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నూతన సంవత్సర నవతెలంగాణ క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్రికలు ప్రభుత్వానికి సూచనలు చేస్తూ, ప్రభుత్వం చేసే తప్పిదాలను ఎప్పటికప్పుడు తెలియజేయాలని అన్నారు. ప్రతి సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రంగాచారి, నవ తెలంగాణ జిల్లా బాధ్యులు గరిపల్లి శ్రీనివాస్, సిద్దిపేట అర్బన్ రిపోర్టర్ అరుణ్ కుమార్, రూరల్ రిపోర్టర్ రాజు, బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గాన్ని అభినందించిన ఎమ్మెల్యే హరీశ్‌రావు



నవతెలంగాణ-సిద్దిపేట

తెలంగాణా గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎమ్మెల్యే హరీశ్‌రావు అభినందించారు. మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ లోగోను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. నూతన సంవత్సరంలో మరింత రెట్టించిన ఉత్సాహంతో పనిచేసి ఇంటర్మీడియట్ ఫలితాల్లో సిద్దిపేటను ముందు వరుసలో నిలపాలన్నారు. అందుకోసం అధ్యాపకులు నిబద్ధతతో ప్రత్యేక తరగతులు తీసుకోవాలని సూచించారు. ఇటీవల హైదరాబాద్ పీఆర్‌టీయు రాష్ట్ర కార్యాలయంలో జరిగిన తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన రాష్ట్ర అధ్యక్షులు కనక చంద్రం, రాష్ట్ర ప్రచార కార్యదర్శి పరాంకుషం నాగేందర్, రాష్ట్ర అధికార ప్రతినిధి నంట శ్రీనివాస్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు గిరిరవి, జిల్లా ప్రధాన కార్యదర్శి ధరిపల్లి నగేష్, ఆర్థిక కార్యదర్శి దుబ్బాక రాజు, మహిళా కార్యదర్శి జ్యోతి, తదితరులకు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. ఈ సందర్భంగా తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా కార్యవర్గం హరీశ్‌రావుకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా సహా అధ్యక్షులు గంగాధర్, భరత్, ఉపాధ్యక్షులు భీమ్ రావు, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

ఏసీపీ రమేష్‌ను సన్మానించిన రామకోటి రామరాజు



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ ఏసీపీ రమేష్ (అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్) పుట్టినరోజు సందర్భంగా మంగళవారం శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షులు రామకోటి రామరాజు ఏసీపీ రమేష్‌ను శాలువాతో సత్కరించి సీతారాముల చిత్రపటం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రామకోటి రామరాజు మాట్లాడుతూ గజ్వేల్ ప్రజలకు అందుబాటులో ఉంటూ నేర నియంత్రణలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. పోలీస్ శాఖలో ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరారు.

కాంగ్రెస్‌తోనే ప్రజలకు మేలు



నవతెలంగాణ-నంగునూరు

ఎప్పుడైనా ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వంలోనే మేలు జరుగుతుందని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి పేర్కొన్నారు. మంగళవారం బద్దిపడగ, సిద్దన్నపేట, అంక్షాపూర్ మైసంపల్లి గ్రామాలలో జరిగిన ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ మండల అధ్యక్షులు బొల్లు సంజీవ్, చిలుక రాజిరెడ్డి, మూల రాంరెడ్డి, బంగారు నర్సిములు, చిలుక శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

అనుదినం ప్రజల పక్షం నవతెలంగాణ

నవతెలంగాణ-రాయపోల్

నిజాలను నిర్భయంగా వాస్తవాలను వార్తలుగా అందించడంలో నవతెలంగాణ దినపత్రిక ఎల్లప్పుడూ ముందుంటుందని రాయపోల్ ఎంపీపీ కల్లూరి అనిత శ్రీనివాస్ అన్నారు. మంగళవారం రాయపోల్ మండల కేంద్రం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నవ తెలంగాణ దినపత్రిక జర్నలిస్టు పుట్ట రాజు ఏర్పాటు చేసిన 2024 క్యాలెండర్ ఆవిష్కరణలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవ తెలంగాణ అనుదినం ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా నిలుస్తూ న్యాయం వైపు పోరాటం చేస్తుందన్నారు. దిన పత్రికలు మీడియా సంస్థలు ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉంటాయని వాస్తవాలను ప్రజలకు అందించడంలో కృషి చేస్తాయన్నారు. పేద బడుగు బలహీన వర్గాల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకు వెళ్లడంలో నవ తెలంగాణ దినపత్రిక ఎల్లవేళల కృషి చేస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేందుకు ఇలాంటి దినపత్రికలు ముందుకు రావాలన్నారు. నిరంతరం ప్రజా సమస్యలను వెలికి తీయడమే కాకుండా ప్రజల పక్షాన నిలబడి ఆ సమస్యలు పరిష్కారమయ్యే వరకు నవ తెలంగాణ కృషి చేస్తుందన్నారు. పేదోడికి అండగా ప్రశ్నించే గొంతుకగ నవ తెలంగాణ సామాన్యుడి పక్షాన సామాజిక హక్కుల కోసం పని చేస్తుందన్నారు. నవ తెలంగాణ దినపత్రిక రాబోయే రోజులలో మరెన్నో శిఖరాలు అధిరోహించి



మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. నవ తెలంగాణ దినపత్రిక ఎల్లప్పుడు పేద బడుగు బలహీన వర్గాలు ఉద్యోగుల విద్యార్థులు రైతులు అన్ని వర్గాల చట్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వచ్చేందుకు నవ తెలంగాణ అనునిత్యం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఇలాగే ఇకముందు ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలబడలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో రాయపోల్ సర్పంచ్ మౌనిక రాజిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ ముత్తాలీఫ్, టీఏలు అనిల్,సంతోష్,కార్యాలయ సిబ్బంది బాలయ్య నరేశ్, ఆనందం, ఫయాజొద్దీన్, ఈ పంచాయితీ కంప్యూటర్ ఆపరేటర్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు పులుగారి నవీన్ గౌడ్, కంప్యూటర్ ఆపరేటర్లు శ్రీకాంత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎంఈవో



నవతెలంగాణ-నంగునూరు

విద్యారంగ సమస్యల పరిష్కారానికి తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం చేస్తున్న కృషి అమోఘమని మండల విద్యాధికారి తగిరెడ్డి దేశిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని నర్మెట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల విద్యాధికారి తగి రెడ్డి దేశిరెడ్డి నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నంగునూరు మండల అధ్యక్షులు పయ్యావుల జైపాల్ యాదవ్, సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు గడీల శ్రీకాంత్, జిల్లా కార్యదర్శి కత్తుల రాంరెడ్డి, మన్మోహన్ రెడ్డి జనార్దన్ రెడ్డి,కల్లాటి శ్రీనివాస్, బొజ్జ చంద్రకాంత్, వెంకటేష్, నరేందర్, రాములు, లక్ష్మీ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద సంఘటనపై కేసు నమోదు

నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని ముత్తన్నపేట గ్రామ స్టేజ్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంపై కేసు నమోదైనట్టు ఎస్ఐ నరేందర్ రెడ్డి మంగళవారం తెలిపారు. రోడ్డు ప్రమాద సంఘటనపై ఎస్ఐ వివరాలు వెల్లడించారు. చీలాపూర్ గ్రామానికి చెందిన తోట సంపత్ (34) కరీంనగర్ నుంచి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వస్తుండగా ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం ముత్తన్నపేట గ్రామ స్టేజ్ వద్ద ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని మెరుగైన చికిత్స కోసం సిద్దిపేట ప్రైవేట్ ఆసుపత్రికి గ్రామస్తులు తరలించారు. రోడ్డు ప్రమాద సంఘటనపై తోట సంపత్, భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్ఐ తెలిపారు.

ప్రభుత్వం మారినా..మాజీ సీఎం ఫోటో మారలేదు



నవతెలంగాణ-బెజ్జంకి

ప్రభుత్వం మారిన అధికారులు వ్యవహారించే తీరు మారడంలేదనే అపోహలు మండలంలో వెల్లవెత్తుతున్నాయి. అధికారుల తీరుకు నిదర్శనంగా మండల పరిధిలోని గాగీల్లపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయమని ఘంటాపథంగా చెప్పోచ్చు. రాష్ట్ర సీఎంగా రేవంత్ రెడ్డి పరిపాలన బాధ్యతలు చేపట్టి రోజులు గడుస్తున్నా గాగీల్లపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ముఖ్యమంత్రి స్థానంలో మాజీ సీఎం కేసీఆర్ ఫోటో యథావిధిగా ప్రజలకు దర్శనమిస్తూనే ఉంది. మాజీ సీఎం కేసీఆర్ ఫోటోను అధికారులు యథావిధిగా కొనసాగించడం అధికారులు తమ విధుల్లో అలసత్వానికి దర్పణం పడుతోందని పలువురు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు గత ప్రభుత్వ భ్రమల్లోంచి మేల్కొని మండలంలోని ఆయా గ్రామాల గ్రామ పంచాయతీ కార్యాలయాలను క్షేత్ర స్థాయిలో సందర్శించి వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోటో ఏర్పాటు చేయాలని ప్రజలు సూచిస్తున్నారు.

6 గ్యారంటీలతో ప్రజల్లో ఆనందం

నవతెలంగాణ-అక్కన్నపేట

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రజాపాలన భాగంగా 6 గ్యారంటీల దరఖాస్తుల పంపిణీ కార్యక్రమాన్ని స్పెషల్ ఆఫీసర్ సంజీవ్ కుమార్, సత్యపాల్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గుడాటిపల్లి, చాపగాని తండా, దుబ్బ తండా, కట్కూరు, గౌరవెల్లి గ్రామాల్లో అప్లికేషన్ ఫామ్‌లు అందించారు. అనంతరం జంగపల్లి ఐలయ్య మాట్లాడుతూ ప్రభుత్వం పేదల అవసరాలు తెలుసుకోవడానికి ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అక్కన్నపేట మండల అధ్యక్షుడు జంగపల్లి ఐలయ్య, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, స్వామి, శ్రీనివాస్, గుడాటిపల్లి సర్పంచ్ బద్దం రాజిరెడ్డి, సొసైటీ డైరెక్టర్ బండి కుమార్, ముకుందా రెడ్డి, అక్కన్నపేట సర్పంచ్ ముత్యాల సంజీవరెడ్డి, కట్కూరు ఎంపిటిసి సుదేష్ణ, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు పాంద్రాల దాము, యువజన కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ, రమేష్ నాయక్ తిరుపతి నాయక్, గుగులోతు రాజు నాయక్, గౌరవెల్లి ఉపసర్పంచ్



భాస్కర్, బీసీ సెల్ మండల అధ్యక్షులు బాలరాజు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు సారయ్య, ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు రవీందర్, అక్కన్నపేట మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ పంగా రాకేష్,ఊళ్లేంగుల రాజు, తిమూర్తి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

హరీశ్‌రావును కలిసిన గజ్వేల్ నేతలు



నవతెలంగాణ-గజ్వేల్

మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావును మంగళవారం గజ్వేల్ డివిజన్ మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ యూడెం కృష్ణారెడ్డి, ఆత్మ కమిటీ మాజీ డైరెక్టర్ కూరాకుల సాయి, సంపత్ తదితరులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలు రానున్న తరుణంలో కార్యకర్తలు సైనికులుగా పనిచేయాలని సూచించారు. పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. నాచారం టెంపుల్ మాజీ చైర్మన్ కొట్టాల యాదగిరి హరీశ్‌రావును కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

పరిశ్రమలో మరణించిన కార్మికునికి న్యాయం చేయాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏ. మహేందర్ రెడ్డి

నవతెలంగాణ-తూప్రాన్ రూరల్/మనోహరాబాద్

మనోహరాబాద్ మండలంలోని కాళ్లకల్ గ్రామ పంచాయతీ పరిధిలోని మహాలక్ష్మి ప్రొఫైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో మరణించిన కార్మికునికి న్యాయం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏ మహేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ రవీందర్ రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. సోమవారం విధుల్లో ఉండి ఇనుప పైపుల లోడు చేస్తుండగా ప్రమాదవశాత్తు అవి కార్మికుడిపై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మరణించిన కార్మికుడు ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వ్యక్తి అని, ఈ మరణానికి యజమాన్యమే బాధ్యత వహించాలన్నారు. మరణించిన కార్మికుడికి వర్క్ మ్యాన్ కాంపెన్సేషన్ యాక్ట్ 1923 ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని డిప్యూటీ లేబర్ కమిషనర్ కోరినట్టు ఆయన తెలిపారు. యాజమాన్యం మాత్రం అలాకాకుండా నామమాత్రంగా నష్టపరిహారం ఇస్తుందన్నారు. అలాగే ఈ పరిశ్రమలోనే దాదాపు 500 మంది ఇతర రాష్ట్రాల కార్మికులు పనిచేస్తున్నారని, వీరు 10 నుంచి 12 గంటలు పనిచేస్తున్నారన్నారు. అలాగే కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయకుండా, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం, అలాగే వలస కార్మికుల చట్టాన్ని అమలు చేయకుండా చట్టాన్ని ఉల్లంఘిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. సేఫ్టీ సౌకర్యాన్ని కూడా కల్పించకుండా, నిర్లక్ష్యం వహించడంతో గతంలో కూడా పరిశ్రమలో ఇలాంటి ప్రమాదాలు జరిగాయన్నారు. సమస్యల పరిష్కారంతో పాటు, మరణించిన కార్మికుడికి చట్టప్రకారం నష్టపరిహారం



ఇవ్వాలని కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్‌ను కోరారు. అలాగే ఈ సమస్యలపై పరిశ్రమల శాఖ అధికారులకు, జిల్లా కలెక్టర్‌కు, ఈఎస్ఐ, పిఎఫ్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మెదక్ జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజు పాల్గొన్నారు.

మద్యం మత్తులో పురుగుల మందు తాగి వ్యక్తి మృతి



నవతెలంగాణ దౌల్తాబాద్

మద్యం మత్తులో పురుగుల మందు తాగి వ్యక్తి మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని దొమ్మాట గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై చైతన్య కుమార్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి గ్రామానికి చెందిన చిన్నబల్లి బుచ్చయ్య(61) డిసెంబర్ 25వ తేదీన మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స కోసం గజ్వేల్ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. చికిత్స చేసిన వైద్యులు రెండు రోజుల తర్వాత డిచార్జ్ చేశారు. వైద్య పరీక్షల నిమిత్తం మరో మూడు రోజుల తర్వాత ఆసుపత్రికి రావాల్సిందిగా వైద్యులు సూచించారు. డిసెంబర్ 30 రోజున వైద్య పరీక్షలకు ఆసుపత్రికి వెళ్లగా పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం ఆర్వీఎం సుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం మృతి చెందాడు.మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చైతన్య కుమార్ రెడ్డి తెలిపారు. మృతికి భార్యా ముగ్గురు కూతుళ్ల ఉన్నారు.

ఉచిత బస్సు విధానాన్ని వ్యతిరేకిస్తూ ఆటో డ్రైవర్ల రాస్తారోకో



నవతెలంగాణ-మద్దూరు

రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం తీసుకువచ్చిన ఉచిత బస్సు ప్రయాణాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని మద్దూరు మండలంలోని లద్నూర్ ఆటో డ్రైవర్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా రాస్తారోకో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని పెట్టడంతో మహిళలు ఎవరు ఆటోలు ఎక్కడం లేదని, తమ జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటమాడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్ కుటుంబాలను దృష్టిలో పెట్టుకొని వెంటనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని రద్దు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు నర్సింలు, భాస్కర్, శంకర్, రవి ,మధు, తదితరులు పాల్గొన్నారు.